ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 8 డిసెంబరు 2024 | 3







ప్రత్యేక కథనం

విరాళాలు ధారాళంగా!

- సత్యదేవుడి ఆలయానికి భక్తుల విరాళాల వెల్లువ
- నిత్యాన్నదాన పథకానికి ఇప్పటిదాకా రూ.62 కోట్లు
- సత్రం గదుల డొనేషన్‌కు ముందుకొస్తున్న దాతలు

అన్నవరం సత్యదేవుడి ఆలయానికి ఏటేటా భక్తుల సంఖ్య లక్షల్లో పెరుగుతోంది. దీనికి అనుగుణంగా అన్నదానం, వసతి, సేవా కార్యక్రమాలను విస్తరించాల్సి వస్తోంది. దీనికి ప్రధానంగా దాతలే అండగా నిలుస్తున్నారు. కోట్లాది రూపాయల విరాళాలు అందిస్తూ తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. అన్నదానం పెద్దఎత్తున సాగడానికి, భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించే సత్రాలు, కల్యాణ మండపాలను నిర్మించి అందుబాటులోకి తెస్తున్నారు. 4



అన్నమయ్య కీర్తనలకు వన్నెలద్ది..

సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి వర్ధంతి నేడు 4

వైభవంగా షష్ఠి తిరునాళ్లు

జిల్లా అంతటా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవాలు

ప్రసిద్ధ ఆలయాలు ఉన్న తాటిపర్తి, మల్లవరం తదితర చోట్ల పోటెత్తిన భక్తులు

ఆయా ఆలయాల వద్ద భారీ ఏర్పాట్లు

జిల్లాలో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయాల వద్ద తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూకట్టారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రసిద్ధి చెందిన బిక్కవోలు సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున జిల్లా నుంచి తరలివెళ్లారు. అలాగే కాకినాడ జిల్లాలో పేరొందిన గొల్లప్రోలు మండలం తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు కిటకిటలాడాయి. అలాగే ఇతర ప్రాంతాల్లోని సుబ్బారాయుడి గుడులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి.



గొల్లప్రోలు మండలం తాటిపర్తి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్







అన్నవరంలో శనివారం రాత్రి జరిగిన సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణోత్సవ దృశ్యాలు

కమనీయం సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్యకల్యాణం

అన్నవరంలో నేటి రాత్రి శ్రీ పుష్పయోగ మహోత్సవం

అన్నవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామంలో వల్లీదేవసేన సమేతుడైన సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్యకల్యాణం శనివారం రాత్రి అంగరంగవైభవంగా జరిగింది. రాత్రి 8 గంటలకు అన్నవరం దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వేదికపైకి నవ వధూవరులను మేళతాళాల నడుమ తోడ్కొనివచ్చి అర్చకస్వాములు కల్యాణతంతుకు శ్రీకారం చుట్టారు. ముందుగా గణపతిపూజతో ప్రారంభించారు. అమ్మవారితో మంగళగౌరీపూజను జరిపించారు. ప్రవర పఠన అనంతరం సుబ్రహ్మణేశ్వరుడికి సువర్ణ యజ్ఞోపవీతాన్ని మంత్రపూర్వకంగా అలంకరించారు. పాద ప్రక్షాళన, మధుపర్క ప్రాశన చేపట్టి మధుపర్కాలను ధరింపజేశారు. సుమూహూర్త వేళ జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని ఒకరి శిరస్సుపై ఒకరికి అలంకరించారు. వేద మంత్రోచ్చరణల నడుమ స్వామి అమ్మవారి మెడలో మూడుముళ్లను వేశారు. ఈ దివ్యకల్యాణం తిలకించేందుకు అన్నవరం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కాగా ఆదివారం రాత్రికి జరిగే శ్రీపుష్పయోగంతో క్రోధి నామ సంవత్సర సుబ్రహ్మణ్య కల్యాణోత్సవాలు ముగుస్తాయి.

'బడి' సందడి!

విజయవంతమైన మెగా పేరెంట్‌టీచర్స్ మీట్.. పాఠశాలల్లో పండుగ వాతావరణం

విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలి : జిల్లా కలెక్టర్, ఎస్పీ

జిల్లావ్యాప్తంగా శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ మీట్ (పీటీఎం) విజయవంతం అయ్యాయి. ఉదయం నుంచే ఆయా పాఠశాలల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. ఈ పీటీఎంలను సక్సెస్ చేయడానికి ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీలతో కలసి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి స్కూలుకూ అతిథులను ఆహ్వానించడంతోపాటు విద్యార్థుల్లో స్ఫూర్తినింపే ఉపన్యాసాలను ఇప్పించారు. అలాగే విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం భోజన ఏర్పాట్లు చేశారు.





కరప మండలం అరట్లకట్ట హైస్కూల్‌లోని మెగా పేరెంట్ టీచర్స్ మీట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్. చిత్రంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్.. (కింద) విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

కరప, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు తిరుగుళ్లు, వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌లు సూచించారు. కరప మండలం అరట్లకట్ట ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీట్‌లో వారు మాట్లాడారు. యుక్తవయసు వచ్చినప్పట్నించి శరీరంలోని మార్పులకు విద్యార్థులు కొంత గందరగోళానికి గురవుతుంటారని, వాటన్నింటినీ నివృత్తిచేస్తూ కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. ఈ సమయంలో సినిమాలు, సీరియళ్ల ప్రభావం వారిపై ఎక్కువగా ఉంటుందని, ఈ క్రమంలో డ్రగ్స్, గంజాయి, మందు వంటి చెడు వ్యసనాలకు గురయ్యే ప్రమాదముందన్నారు. విద్యాపరమైన అంశాలను చూసేందుకు మాత్రమే మొబైల్స్‌ను ఇవ్వాలని, చదువు ప్రాముఖ్యతను, జీవిత లక్ష్యాలను నిర్దేశిస్తూ వారి ఉజ్వల భవిష్యత్‌కు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్‌ను ఆవిష్కరించి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. పేరెంట్స్‌తో కలిసి పలువురు విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను తిలకించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు అందజేసి వాటిలోని వివరాలపై పేరెంట్స్‌కు అవగాహన కల్పించారు. వివిధ అంశాల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు మెమెంటోలను అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్‌తో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌కు కలెక్టర్ స్వయంగా చిక్కీనందించి తినమని సూచించారు. పాఠశాల అభివృద్ధికి గతంలో దాతలు రూ.4లక్షలు ప్రభుత్వానికి అందించారని, అయితే ప్రభుత్వం నుంచి మ్యాచింగ్ గ్రాంట్ నేటికీ విడుదల కాకపోవడంతో ఆ నిధులు అలాగే ఉండిపోయాయని ఈ సందర్భంగా గ్రామ టీడీపీ నాయకుడు యరమాటి సతీష్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అభివృద్ధి పనుల కోసం ఆ నిధులను తిరిగి ఇవ్వాలని విన్నవించారు. అరట్లకట్ట హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం పీవీ శివగిరి, ఎస్‌ఎంసీ చైర్మన్ దారా వీరబాబు, ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, మండల స్పెషల్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి శ్రీనివాసనాయక్, ఈవోపీఆర్డీ సలాది శ్రీనివాస్, కార్యదర్శి రామ్‌జీ హీరాలాల్ పాల్గొన్నారు.

ఈనెల 10వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు : జేసీ

రైతు సంఘాల ప్రతినిధులతో రాహుల్ మీనా సమావేశం

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేదీ నుంచి జిల్లాలో జరగనున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులు తమ సూచనలు తెలియజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా కోరారు. శనివారం కలెక్టరేట్‌లో జేసీ రాహుల్‌మీనా రైతు సంఘాల ప్రతినిధులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించి వారి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ వివాదాల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు ఈ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. వీటిని సక్రమంగా నిర్వహించేందుకు రైతు సంఘాల నేతలు, ఇతర ప్రతినిధులతో చర్చించడం జరిగిందన్నారు. జిల్లావాసులు ఈ రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు గ్రీవెన్స్ కార్యక్రమం రద్దు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఏర్పాటుచేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం అనివార్య కారణాలు వల్ల రద్దు చేసినట్టు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన శనివారం విడుదల చేశారు.

జీజీహెచ్ మేనేజర్ నరసింగరావు సస్పెన్షన్

నర్సింగ్ పోస్టుల భర్తీలో అక్రమాలకు తెర

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ మేనేజర్ నరసింగరావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ శనివారం రీజినల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీచేశారు. నర్సింగ్ పోస్టుల భర్తీలో అక్రమాలు, నాన్ లోకల్ అనర్హులకు ఉద్యోగాలు ఇవ్వడం, రోస్టర్ బుక్ లేకుండా ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టడం వంటి పలు ఆరోపణలపై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్.. మేనేజర్‌పై విచారణకు ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో నరసింగరావు అవినీతిపై విచారణ చేపట్టగా, అవినీతికి పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. దీంతోపాటు అనుబంధ విషయాల సమాహారంగా కలెక్టర్ 5 అంశాలతో కూడిన నోట్‌ఫైల్‌ను సిద్ధం చేశారు. జీజీహెచ్ మేనేజర్ అవినీతికి పాల్పడడం యదార్థమేనని నిర్ధారించి, మెమో జారీ చేశారు. దీనికి నరసింగరావు ఇచ్చిన సమాధానం సంతృప్తిగా లేకపోవడంతో శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలకు అర్హుడని తక్షణమే మేనేజర్‌ని సస్పెండ్ చేయాలని నోట్‌ఫైల్‌లో కలెక్టర్ పేర్కొంటూ ఆర్‌డీ డాక్టర్ పద్మావతికి పంపించారు. మేనేజర్‌పై వచ్చిన ఆరోపణలపై ఆర్‌డీ కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్ వచ్చి విచారణ నిర్వహించి నివేదిక అందించారు. కలెక్టర్ నివేదిక ఆధారంగా మేనేజర్ నరసింగరావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ శనివారం ఆర్‌డీ డాక్టర్ పద్మాశశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

జిల్లాలో 14 కేంద్రాల్లో నిర్వహణ

హాజరుకానున్న 3,789 మంది

కాకినాడ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) 2024-25కు సంబంధించిన పరీక్ష ఆదివారం జరుగుతుందని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. కాకినాడ జిల్లాలోని 14 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ జరుగుతుందన్నారు. కాకినాడ డివిజన్‌లో 8, పెద్దాపురం డివిజన్‌లో 6 పరీక్షా కేంద్రాలను కేటాయించినట్టు తెలిపారు. మొత్తం ఈ పరీక్షకు 3,789 మంది విద్యార్థులు ఎన్‌రోల్ చేసుకున్నారన్నారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.

సాయుధ దళాలకు విరాళాలు అందించాలి : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా సైనిక వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షాన్‌మోహన్ సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలందరూ సాయుధ దళాల పతాక దినోత్సవ విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. మాజీ సైనికులు, యుద్ధ వితంతువులు సంక్షేమం కోసం ఫ్లాగ్‌డే సందర్భంగా మనం అందించే విరాళాలు ఒక మంచి కార్యక్రమం కోసం సద్వినియోగం చేసుకోవడం జరుగుతుందన్నారు. సాయుధ దళాల కోసం ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా విరాళాలు అందించాలన్నారు. విరాళాలు అందజేసే వ్యక్తులు సంస్థలు, జిల్లా సైనిక్ సంక్షేమ కార్యాలయం వారి పేరు మీద స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, జిల్లా పరిషత్ శాఖ, కాకినాడ బ్రాంచ్‌లోని ఖాతా సంఖ్య 62064060623 ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0020974 నేరుగా జమ చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ సత్యప్రసాద్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, రిటైర్డ్ సైనిక ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఇసుక అందుబాటులోకి ఎప్పుడో?

స్టాక్‌యార్డుల టెండర్లు ఖరారు చేసినా ప్రయోజనం లేదు

స్టాక్ యార్డుల పరిశీలన పేరుతో జాప్యం.. లబ్ధిదారుల ఎదురుచూపులు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఇసుక ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు. రీచ్‌లను ప్రకటించి స్టాక్ యార్డుల నిర్వహణకు ముగ్గురు టెండర్‌దారులను ఖరారు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఇసుక కోసం లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాకినాడ జిల్లాకు ఇసుక సరఫరా చేసేందుకు వేమగిరి, తీపర్రు-3 ఇసుక రీచ్‌లను ప్రభుత్వం కేటాయించింది. ఈ రీచ్‌ల నుంచి ఇసుక తవ్వి జిల్లాకు కేటాయించిన కాకినాడ రూరల్, పెద్దాపురం, గొల్లప్రోలు స్టాక్‌యార్డులకు తరలించాలని అధికారులు ఆదేశించారు. ఈనేపథ్యంలో గతనెల 22వ తేదీన స్టాక్‌యార్డుల నిర్వహణకు ఏజెన్సీలను లాటరీ విధానంలో ఖరారు చేశారు. మూడు స్టాక్‌యార్డులను ముగ్గురికి అప్పగించారు. అయితే రెవెన్యూ అధికారుల బృందం ఈ మూడు యార్డుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, ఇసుక రవాణాకు అనుకూలంగా ఉన్నాయో వంటివి పరిశీలన చేశారు. దీనిలో పెద్దాపురం స్టాక్‌యార్డు నిర్వహణకు అనుకూలంగా ఉందని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇంకా కాకినాడ రూరల్, గొల్లప్రోలు స్టాక్‌యార్డుల పరిశీలన కొనసాగుతోంది. దీంతో ఇసుక నిల్వ ఉంచేందుకు ఇంకా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. స్టాక్‌యార్డుల నిర్వహణకు టెండర్లు ఖరారు చేసి పదిహేనురోజులు అయినప్పటికీ ఉచిత ఇసుక అందుబాటులోకి తీసుకురాకపోవడంతో అవసరానికి ఇసుక లేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో గృహాలు, రోడ్లు, భారీభవంతుల నిర్మాణాల్లో జాప్యం చోటుచేసుకుంటుంది. దీంతో ఉపాధిలేక భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఆ స్టాక్‌యార్డుల్లో టన్ను రూ.600

కాకినాడ రూరల్, పెద్దాపురం స్టాక్‌యార్డుల్లో టన్ను ఇసుక రూ.600కే లభిస్తుందని అధికారులు ప్రకటించారు. అలాగే గొల్లప్రోలు స్టాక్‌యార్డుల్లో టన్ను ఇసుక రూ.582కే లభిస్తుందని పేర్కొన్నారు. అయితే స్టాక్‌యార్డుల నిర్వహణే ప్రశ్నార్థకంగా తయారవ్వడంతో ప్రజలు అయోమయంలో ఉన్నారు. ప్రస్తుత అవసరాలకు ఇసుక అందుబాటులో లేదని చెబుతున్నారు.

రీచ్‌లలో నీరు ఉండడంతో జాప్యం

వేమగిరి, తీపర్రు-3 ఇసుక రీచ్‌లలో నీరు అధికంగా ఉండడం వల్లే ఇసుక తవ్వకాలకు అనుకూలంగా లేదు. నీటి ప్రవాహం తగ్గిన తర్వాత ఇసుక తవ్వకాలు జరుగుతాయి. అక్కడ నుంచి కాకినాడ రూరల్, పెద్దాపురం, గొల్లప్రోలు స్టాక్‌యార్డులకు ఇసుక తరలిస్తారు. వచ్చే సోమవారానికల్లా మూడు ఇసుక స్టాక్‌యార్డుల్లో ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నాం. స్టాక్‌యార్డులను కూడా రెవెన్యూ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. ఇసుక స్టాక్ యార్డుల నుంచి ఇసుక సులభతరంగా రవాణా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

- జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

ప్రభుత్వ కార్యక్రమాలను కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించాలి

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న వివిధ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్‌రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు గ్రామస్థాయి వరకు చేరేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఇందుకు జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ నోడల్ అధికారిగా విపత్తులు నిర్వహణ శాఖ ప్రాజెక్టు మేనేజర్ వ్యవహరిస్తారన్నారు. సభ్యులుగా జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ పీడీ, మున్సిపల్ కార్పొరేషన్, పౌర సరఫరాలు, భూగర్భగనులు, ఎక్సైజ్, రోడ్డు భవనాలు, పంచాయతీరాజ్, దేవదాయశాఖ అధికారులు ఉంటారన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో త్రినాథ్, పౌరసరఫరాల సంస్థ డీఎం దేవులా నాయక్, రోడ్డు భవనాల శాఖ ఎస్ఈ కంఠు, ఇన్‌చార్జి పౌరసరఫరాల అధికారి ప్రసన్న లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురిలో విజేత ఎవరో..

రేపే ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్.. జేఎన్‌టీయూకేలో ఏర్పాట్లు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల్లో ఐదుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎన్నికల పోలింగ్ ముగిసిపోయింది. బ్యాలెట్ బాక్స్‌ల్లో అభ్యర్థుల భవితవ్యం ఉంది. ఐదుగురిలో విజేతగా ఎవరు నిలుస్తారనే ఉత్కంఠ కొనసాగుతోంది. సోమవారం నాడు ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్ జరుగునుండడంతో అధికారులు సర్వం సిద్ధంచేశారు. కాకినాడ జేఎన్‌టీయూకేలో డాక్టర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ఆరంభమవుతుంది. మొత్తం 16737 మంది ఓటర్లు ఉండగా 15,490 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 14 టేబుల్స్‌పై 9 రౌండ్లో ఓట్ల లెక్కింపు చేస్తారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ లెక్కింపును పర్యవేక్షిస్తారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ సాయంత్రం వరకు సాగుతుంది. ఎన్నికల బరిలో నిలిచిన బొర్రా గోపి మూర్తి, గంధం నారాయణరావు, కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్, నామన వెంకటలక్ష్మిలు కౌంటింగ్ ప్రక్రియకు హాజరవుతున్నారు. ఎన్నికల అధికారులు తొలుత తొలి ప్రాధాన్యత ఓటు లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తారు. తొలి ఓటులో ఏ అభ్యర్థికి స్పష్టమైన మెజార్టీ రాకపోతే రెండో ప్రాధాన్యత ఓటు లెక్కించి ఎన్నికలలో విజేతను ప్రకటిస్తారు.

ప్రత్యేక కథనం

విరాళాలు.. ధారాళంగా



అన్నదానం సత్రంలో..



శ్రీ లలితా రైస్ వారు నిర్మించిన ప్రసాద తయారీ భవనం

- సత్యదేవుడి ఆలయానికి భక్తుల విరాళాల వెల్లువ
- నిత్యాన్నదాన పథకానికి ప్రారంభం నుంచి ఇప్పటికి 1.50 లక్షలమంది దాతల నుంచి రూ.62కోట్లు
- సత్రం గదుల డొనేషన్‌కు ముందుకొస్తున్న దాతలు
- దాతలకు ప్రత్యేక గుర్తింపుగా సిల్వర్, గోల్డ్, ప్లాటినం కార్డులు జారీ
- వీటి ద్వారా సదరు దాతకు ప్రత్యేక సౌకర్యాల కల్పన





దాతల సహకారంతో నిర్మించిన వసతి కోసం శివ సదన్.. రత్నగిరి డార్మిటరీ



విరాళాల కౌంటర్లు

(ఆంధ్రజ్యోతి- అన్నవరం)

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా.. భక్తితత్వానికి నిలయంగా.. ప్రశాంతతకు ఆలవాలంగా నిలుస్తోంది.. అన్నవరంలోని సత్యదేవుడి పుణ్యక్షేత్రం. రాష్ట్రంలో తిరుపతి తర్వాత ఆ స్థాయిలో ఖ్యాతి గడించిన ఆలయమిది. ఈ ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. ఆలయానికి హుండీలతోపాటు దర్శనాలు, వ్రతాలు, సత్రం గదులు, ప్రసాదం, ఆలయ పరిధిలో వివిధ షాపుల వేలం వంటి రూపాల్లో ఆదాయాలు వస్తుంటాయి. ఇదంతా ఒకెత్తు అయితే భక్తుల విరాళాలు ప్రత్యేకం. ఇక్కడికి వచ్చే చాలామంది స్వామికి తమ వంతుగా వివిధ రూపాల్లో విరాళాలు ఇస్తుంటారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు సౌకర్యాలకు కానుకలతోపాటు దాతల దాతృత్వం కూడా ఎంతో ముఖ్యం. అసలు సత్యదేవుడికి ఎన్ని రూపాల్లో విరాళాలు వస్తుంటాయి. ఎంత వచ్చి ఉంటాయి. ఎన్నిరకాలుగా ఇవ్వొచ్చు... దాతలకు దేవస్థానం కల్పించే సౌకర్యాలు వంటి విశేషాలు తెలుసుకుందాం..

కొండపై ప్రత్యేక కౌంటర్లు

అన్నవరం సత్యదేవుడి ఆలయానికి ఎందరో దాతలు తమవంతు సాయమందిస్తూ ఉంటారు. అన్నదానం, గోసంరక్షణ ట్రస్టు, సత్రం గదులకు సంబంధించి దేవస్థానం తరఫున విరాళాలు స్వీకరిస్తుంటారు. వీటికి రత్నగిరిపై ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటుచేశారు. అన్నదానానికి సంబంధించి మూడుచోట్ల కౌంటర్లు ఉన్నాయి. గోసంరక్షణ, సత్రం గదులకు కూడా ఏర్పాటు చేశారు. దాతలు వీటిని సంప్రదించి విరాళాలు ఇస్తుంటారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకం

అన్నవరం దేవస్థానంలో అధికంగా సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళాలు అందిస్తుంటారు. ఈ పథకం 1987లో ప్రారంభం కాగా ఇప్పటివరకు రూ.62 కోట్లు విరాళాలుగా వచ్చాయి. వీటిపై వచ్చే వడ్డీతో ప్రతినిత్యం నిత్యాన్నదానం చేస్తుంటారు. ఇప్పటివరకు ఈ పథకంలో రూ.1116 నుంచి ఆపై విరాళాలు అందించిన దాతల సంఖ్య లక్షా 50 వేలమంది వరకు ఉన్నారు. వీటిపై ఏటా వడ్డీల రూపంలో రూ.4.5 కోట్లు సమకూరుతోంది. కేవలం ఈ వడ్డీతోనే సరాసరిన రోజుకు 4 వేలమందికి ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నారు. వీటిలో రూ.లక్షపైబడి విరాళమిచ్చిన వారికి మాత్రమే కొన్ని వెసులుబాట్లు కల్పిస్తారు. వీరికి మొదటి ఏడాదికి ఒకసారి ఉచితంగా సత్రం గది, ఉచితంగా వ్రతం చేసుకునే అవకాశం, కుటుంబ సభ్యులకు అంతరాలయ దర్శనం కల్పిస్తున్నారు. తదుపరి ఏడాది నుంచి కేవలం ప్రత్యేక దర్శన సౌకర్యం మాత్రమే ఉంటుంది. ఈ నిధులు కేవలం అన్నదాన ట్రస్టుకు చెందుతాయి. ఈ పథకానికి సెక్షన్ 80జీ ప్రకారం ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది. దీనికి రూ.500పైబడి విరాళం ఇవ్వొచ్చు. రూ.లక్షపైబడి డొనేషన్ చేసినవారి పేరు వారు సూచించిన రోజున అన్నదానం వద్ద బోర్డులో ప్రదర్శిస్తారు.

సత్రం గదులకు డొనేషన్లు

దేవస్థానంలో ప్రస్తుతం హరిహరసదన్, శివసదన్ కాటేజీలకు డోనార్ స్కీం అమలవుతోంది. హరిహరసదన్‌లో ఒక రూంకు డోనార్ రూ.5 లక్షలు, శివసదన్‌లో రూ.10 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. వీరి పేరు వీరికి కేటాయించిన సత్రం గదిపై శాశ్వతంగా లిఖిస్తారు. గది డోనార్‌కు ఏడాదిలో 30రోజులపాటు దాతకుగానీ, దాత సిఫార్సు చేసిన వారికిగానీ ఉచితంగా పదేళ్లపాటు కొనసాగిస్తారు. వీరికి ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. దాత 15రోజులు ముందుగా దేవస్థానం సంబంధిత విభాగానికి ఈ సమాచారం చేరవేయాల్సి ఉంటుంది. అప్పటికప్పుడు వస్తే ఆలయంలో భక్తుల రద్దీని బట్టి ప్రాధాన్య క్రమంలో సత్రం గదులు కేటాయిస్తారు. ఈ విరాళాల ద్వారా వచ్చిన మొత్తం దేవస్థానం మెయిన్ అకౌంట్‌కు జమచేస్తారు. వ్యక్తిగత గెస్ట్‌హౌస్‌లు కూడా విరాళాల జాబితాలో ఉన్నాయి. కొండపై ఉన్న అంజనీ గెస్ట్‌హౌస్, రామరాజు నిలయం, పల్లవి గెస్ట్‌హౌస్, సీతానిలయం, సత్యనిలయం, సత్యకిరణ్‌నిలయం, సీతారామసదన్ గెస్ట్‌హౌస్ తదితర ఏడు గెస్ట్‌హౌస్‌లను దాతలు నిర్మించారు. వీరికి ఏడాదిలో 30 రోజులపాటు ఉచితంగా గెస్ట్‌హౌస్ కేటాయిస్తారు. నెలరోజుల తర్వాత కూడా రద్దీనిబట్టి ఈ దాతలు సిఫార్సు చేసినవాళ్లకి వీటిని ఇచ్చే అవకాశం ఉంది. దేవస్థానం పరిధిలోనే కేటాయింపు చేస్తారు.

గోసంరక్షణ ట్రస్ట్‌కు విరాళాలు

భక్తులు గోసంరక్షణ ట్రస్ట్‌కు కూడా విరాళాలు అందించవచ్చు. పదేళ్ల కిందట నెలకొల్పిన ఈ ట్రస్ట్ ద్వారా వచ్చే విరాళాలను గోవుల సంరక్షణ, దాణా తదితర వాటికి వినియోగిస్తుంటారు. ఇప్పటివరకు ఈ ట్రస్ట్‌కు రూ.1.57 కోట్లు విరాళాలుగా వచ్చాయి. దేవస్థానంలో 49 ఆవులు, 23 గిత్తలు, ఎద్దులు 4, పెయ్యిలు 21 ఉన్నాయి. విరాళమిస్తే ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది.

స్వల్పంగానే అతిపెద్ద డోనార్లు

అన్నవరం దేవస్థానంలో రూ.కోటిపైబడి విరాళాలందించిన వారు స్వల్పంగానే ఉన్నారు. వీరిలో కాకినాడ తిమ్మాపురంలో కర్రి బామిరెడ్డి జమిందారు 45 ఎకరాల భూమిని విరాళంగా అందించారు. లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేతలు మట్టే సత్యప్రసాద్ ప్రసాదం తయారీ భవనాన్ని రూ.4 కోట్లతో, స్వామి, అమ్మవార్లకు వజ్రకిరీటం, కర్ణాభరణాలు రూ.3 కోట్లతో, ఇంకా పలు వెండి వస్తువులు, గర్భాలయ బంగారు తాపడం పనులు కూడా చేపట్టారు. రూ.25 లక్షలతో సహస్ర దీపాలంకరణ మందిరం నిర్మించారు. లలిత రైస్ మరో ఎండీ మట్టే శ్రీనివాస్, సత్యశ్రీనివాస ఉచిత కల్యాణవేదికను రూ.4.5 కోట్లతో చేపట్టడంతోపాటు వంశపారంపర్యంగా స్వామివారి నివేదనకు అవసరమయ్యే బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. నిత్యం జరిగే పంచహారతులకు వెండి సామగ్రిని అందించారు. పారిశ్రామికవేత్త ఎంఎస్ రెడ్డి అంజనీ గెస్ట్‌హౌస్, ఉచిత కల్యాణమండపాలను నిర్మించారు. రాజమహేంద్రవరానికి చెందిన పెన్నాడ నాగమణి రూ.2 కోట్లతో ఉచిత డార్మెటరీ నిర్మించారు. అదేవిధంగా మరో ఐదుగురు దాతలు పలు గెస్ట్‌హౌస్‌లు నిర్మించారు.

విరాళాన్ని బట్టి కార్డులు

నిత్యాన్నదాన పథకానికి విరాళం అందించే దాతలకు గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో దేవస్థానం వారి విరాళాన్ని బట్టి పేర్లు కేటాయించింది. రూ.వెయ్యి నుంచి రూ.10 వేల వరకు దాతలుగా, రూ.10వేల నుంచి రూ.50 వేల వరకు పోషకులుగా, రూ.50 వేల నుంచి రూ.లక్షవరకు రాజపోషకులుగా, రూ.లక్ష పైబడి మహారాజపోషకులుగా పరిగణించారు. దీంతోపాటు దాతలకు వారిచ్చిన డొనేషన్ ఆధారంగా ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఇటీవల దేవస్థానం ప్రత్యేక కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది. వీటిలో రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు విరాళం అందించిన వారికి సిల్వర్ కార్డు, రూ.10 లక్షల నుంచి రూ.కోటి విరాళమిచ్చిన వారికి గోల్డ్‌కార్డు, రూ.కోటి ఆపైన డొనేట్ చేసిన వారికి ప్లాటినం కార్డులను జారీ ప్రారంభించింది.

విరాళం అందించాలనుకుంటే..

ఆలయంలో స్వామివారికి విరాళం అందించాలనుకుంటే కొండపై సంబంధిత కౌంటర్‌లో సంప్రదించాలి. నగదు, చెక్కు, డిజిటల్ పేమెంట్ రూపాల్లో విరాళం ఇవ్వొచ్చు. నగదు అయితే రూ.49 వేల లోపు స్వీకరిస్తారు. ఆపైన ఎంత ఇచ్చినా తప్పనిసరిగా పాన్‌కార్డు ఇవ్వాలి. అన్నవరం దేవస్థానం వెబ్‌సైట్‌లోగానీ, యాప్‌గానీ విరాళాన్ని డిజిటల్ పేమెంట్ చేయొచ్చు. ఆన్‌లైన్‌లో పేమెంట్ చేసిన తర్వాత సంబంధిత పత్రాలతో దేవస్థానాన్ని సంప్రదించి తగిన సౌకర్యాలు పొందొచ్చు.

డోనార్ సెల్ ఏర్పాటు కలగానే..

అన్నవరం దేవస్థానంలో డోనార్ సెల్ ఏర్పాటు చేయాలని కొంతకాలంగా ప్రతిపాదనలు ఉన్నా అవి కలగానే మిగిలిపోతున్నాయి. సాధారణ దాతలకు దేవస్థానం తరఫున సౌకర్యాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి డోనార్ సెల్ ఏర్పాటు చేస్తే విరాళాల తదనంతర సౌకర్యాల కల్పనకు అటూఇటూ తిరగాల్సిన పని ఉండదని దాతలు కోరుతున్నారు.







లలితా రైస్ వారు నిర్మించిన శ్రీ సత్య శ్రీనివాస ఉచిత కల్యాణ వేదిక.. ఎంఎస్ రెడ్డి- అంజని ఉచిత వివాహ వేదిక.. రామరాజు అతిథి గృహం

ఆలయాలు... భక్తజన సంద్రం



తాటిపర్తిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారం

తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనాలకు బారులు తీరిన భక్తులు



గొల్లప్రోలు మండలం తాటిపర్తి ఆలయంలో నిద్రిస్తున్న ఉపవాస దీక్ష చేసిన మహిళలు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి సందర్భంగా శనివారం కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లో స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు భక్తజనసంద్రమయ్యాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తాటిపర్తిలో స్వయంభూ వల్లీదేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వర 87వ షష్ఠి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించి భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆలయం సమీపంలో ఉన్న పుట్టల వద్ద గుడ్లు, పాలు ఉంచి పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షతో ఉన్న మహిళలు ఆలయ ప్రాంగణంలోనే నిద్రించారు. భక్తుల కోసం ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు భారీ పోలీసుబందోస్తు నిర్వహించారు. మల్లవరంలోని స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఉదయం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి స్నానాలు జరిగాయి. స్వామికి మహారుద్రాభిషేకం, క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. సంతాన ప్రాప్తి కోసం వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఆలయాలకు చేరుకుని ఉపవాస దీక్ష కొనసాగిస్తున్నారు. ఉగ్రషష్ఠి మండపంలో నిద్రించారు.

కనుల పండువగా కల్యాణం

తాటిపర్తి, మల్లవరంలో స్వయంభూ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిల కల్యాణం శనివారం రాత్రి కనుల పండువగా జరిగింది. తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

బిక్కవోలులో వైభవంగా షష్ఠి వేడుకలు




అలంకారరూపంలో బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామివారు

బిక్కవోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన తూర్పుగోదావరి జిల్లాలోని బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున 1.20 గంటలకు స్వామివారి తీర్థపు బిందె సేవతో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి ఉత్సవాలను ప్రారంభించారు. తొలిపూజలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, కుమారుడు మనోజ్‌రెడ్డి పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అప్పటి నుంచి భక్తులకు స్వామి దర్శనాలు కల్పించారు. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. సంతానార్థులైన స్త్రీలు స్వామి పుట్టపై ఉంచిన నాగచీరలను ధరించి ఆలయం వెనుక నిద్రించారు. ఉదయం 8.10 గంటలకు స్వామివారిని మయూర వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఆలయ ఆవరణలో దొడ్డిపట్ల, మొగల్తూరు, ఉండ్రాజవరం, బిక్కవోలు వారు నిర్వహించిన బ్యాండు కచేరీలు కనువిందు చేశాయి. 4 నుంచి 5వరకూ కాల్చిన బాణసంచా భక్తులను ఆకట్టుకుంది. ఆలయంలో పూలు, పండ్ల డెకరేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం : మంత్రి

షష్ఠి సందర్భంగా స్వామివారికి మంత్రి వాసంశెట్టి సుభాష్ పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టెంపుల్ సర్క్యూట్ ప్రాజెక్టులో బిక్కవోలు శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. స్వామిని దర్శించుకున్న ప్రముఖుల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, కేపీఆర్ సంస్థల డైరెక్టర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఎస్పీ నరసింహకిషోర్, అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు ఉన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి సుభాష్

ఎ.వేమవరంలో ప్రత్యేక అభిషేకాలు

అమలాపురం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం ఎ.వేమవరంలో ప్రసిద్ధి నొందిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం తెల్లవారు జాము నుంచి ఆలయ అర్చకుడు చంద్రమౌళి సురేష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఆలయంలో స్వామివారికి పూలు, పడగలు సమర్పించేందుకు భక్తులు బారులు తీరారు. జనుపల్లిలోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయం వద్ద నుంచి పంచ కావిళ్లతో గ్రామస్తులు, అయ్యప్ప స్వాములు, భవానీలు, భక్తజనం తరలివెళ్లారు. ఎ.వేమవరంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచ కావిళ్లతో అభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం ఛైర్మన్ కోంపెల్ల వెంకటశ్రీనివాస్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. నడిపూడి మెట్ల రాంజీ కాలనీలో పుట్ట ఆలయం వద్ద స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. చంద్రమౌళి వెంకటేశ్వరశర్మ, ఆకొండి శ్రీకృష్ణ ఆచార్య బ్రహ్మత్వంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయం వద్ద షష్ఠి తీర్థం వైభవంగా జరిగింది.



ఎ.వేమవరంలో సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం వద్ద క్యూలో భక్తులు

వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పొటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామివారి తిరువీధుల్లో 7 ప్రదక్షిణలు నిర్వహించుకుని స్వామిని దర్శించుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా రూ.31.68 లక్షలు లభించినట్టు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

రూ.31.68 లక్షల ఆదాయం



వాడపల్లి వెంకన్న ఆలయంలో క్యూలైన్లో భక్తులు



అన్నమయ్య కీర్తనలకు వన్నెలద్ది..

నేడు వర్ధంతి

కర్నాటక సంగీతాన్ని సుసంపన్నం చేసిన సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి

(ఆంధ్రజ్యోతి- పిఠాపురం)

ఆయన సంగీత కచేరీలు మరుపురానివి.. ఆయన స్వరపరిచి ఆలపించిన కీర్తనలు వినసొంపైనవి.. సంగీత, కళాభిమానుల చెవుల్లో అవి ఇంకా వినబడుతూనే ఉన్నాయి. ఎందరో ఉద్ధండుల మన్ననలు పొందిన ఆయనే ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసుడు, సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి. ఆదివారం నేదునూరి వర్ధంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మహారాజా ఎస్టేట్‌లో పనిచేస్తున్న శ్రీరామమూర్తి పంతులు, విజయలక్ష్మి దంపతులకు నేదునూరి కృష్ణమూర్తి 1927 అక్టోబరు 10న జన్మించారు. తన తల్లి, మేనమామల ద్వారా సంగీతంపై ఆసక్తి పెంచుకున్న ఆయన 1940లోనే విజయనగరంలోని మహారాజా మ్యూజికల్ కళాశాలలో వయోలిన్, సంగీతాన్ని నేర్చుకున్నారు. 1950 వరకూ పిఠాపురంలోనే నివసించిన ఆయన తర్వాత ఇక్కడ నుంచి వెళ్లి విశాఖపట్నంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. మద్రాసు మ్యూజిక్ అకాడమీలో ఐదు దశాబ్దాలకు పైగా సంగీత కచేరీలు నిర్వహించారు. తదనంతరం కంచికామకోటి పీఠం, తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ కనకదుర్గమ్మ వారి దేవస్థానంలో ఆస్థాన విద్వాంసులుగా పనిచేశారు.

అన్నమాచార్య కీర్తన్లతో ప్రాచుర్యం

దేశ, విదేశాల్లో నేదునూరి కృష్ణమూర్తి చేసిన అన్నమాచార్య సంకీర్తనలు మంచి ప్రాచుర్యం పొందాయి. అనేక అన్నమయ్య కృతులకు బాణీలు కట్టారు. నానాటి బ్రతుకు నాటకం కీర్తనకు నేదునూరి కట్టిన బాణీని ప్రముఖ గాయకురాలు ఎమ్ఎస్ సుబ్బలక్ష్మి ప్రశంసిస్తూ ఈ ఒక్క పాటకు బాణీ కట్టినందుకు మీకు సంగీత కళానిధి ఇవ్వొచ్చు అన్నారంటే ఆయన ప్రతిభ ఇట్టే అర్థమవుతుంది. వీటితో ఆయన స్వరపర్చిన కీర్తనల్లో దాశరథి శతకం పద్యాలు, రాగసుధరసాలతో భద్రాచల రామదాసు కీర్తనలు అత్యంత ప్రాచుర్యం పొందాయి. నేదునూరి తొలుత విజయవాడ జీవీఆర్ ప్రభుత్వ సంగీత, నాట్యకళాశాల ప్రధాన అధ్యాపకుడిగా తదనంతరం సికింద్రాబాద్, విజయనగరం, తిరుపతి సంగీత కళాశాలల్లో పనిచేశారు. వెంకటేశ్వర, నాగార్జున విశ్వవిద్యాలయాల్లో ఆర్ట్స్ విభాగం డీన్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, ఆల్‌ఇండియా రేడియో సంగీత విభాగం ఆడిషన్ బోర్డు సభ్యుడిగా వ్యవహరించారు. కొంతకాలం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో గౌరవ ఆచార్యుడిగా ఉన్నారు.

అవార్డులు, పురస్కారాలు

నేదునూరికి పలు పురస్కారాలు, అవార్డులు లభించాయి. 1976లో చెన్నైలోని శ్రీకృష్ణ గానసభ సంగీత చూడామణి అవార్డుతో తొలుత సత్కరించింది. అప్పటినుంచి 2014 వరకూ 53కిపైగా పురస్కారాలు అందుకున్నారు. వీటిలో 1991లో మద్రాసు మ్యూజిక్ అకాడమీ నుంచి సంగీత కళానిధి, 1995లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళానీరాజన పురస్కారాలు ప్రధానమైనవి. స్వరవిలాస్, నాద సుధానిధి, సంగీత విద్వన్మణి, నాదయోగి, సంగీత కళాభారతి తదితర 51కిపైగా అవార్డులు ఆయన్ను వరించాయి.

పిఠాపురంపై ఎనలేని మమకారం

నేదునూరి ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా పిఠాపురంపై మాత్రం మమకారం వీడలేదు. చిన్నతనంలో ఆయన కుటుంబం పిఠాపురంలోని కోటవారివీధి, ఆకొండివారి వీధిలో నివాసం ఉంది. ఆ వీధుల్లో నివసిస్తున్న వృద్ధుల్లో పలువురికి నేదునూరి కుటుంబంతో అవినావభావ సంబంధాలున్నాయి. జీవితచరమాంకంలోనూ అనారోగ్యంతో ఉన్నప్పటికీ మరణానికి నెలన్నర రోజుల ముందే పాదగయను కుటుంబసభ్యులతో కలిసి సందర్శించి పూజలు జరిపారు. పాదగయ అభివృద్ధికి లక్ష రూపాయలను విరాళంగానూ అందించారు. అనారోగ్యానికి గురయ్యే వరకూ నేదునూరి కీర్తనలను ఆలపిస్తూ.. స్వరపరుస్తూనే ఉన్నారు. నాదాసుధ తరంగణి సంస్థ ద్వారా నాదయోగి ఆత్మకథ, 108 భద్రాచలం రామదాసు కీర్తనలు, భక్తిరస కీర్తనలు, 200కిపైగా అన్నమయ్య సంకీర్తనలు, 25 యోగా నారాయణ కీర్తనలను ఆయన స్వరపరిచారు. 87 ఏళ్ల వయస్సులో 2014, డిసెంబరు 8న విశాఖపట్టణంలో తుదిశ్వాస విడిచారు.

ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే తాజాగా క్రిస్మస్ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సామర్లకోట మీదుగా విశాఖ-సికింద్రాబాద్, బ్రహ్మపూర్-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే పీఆర్వో కార్యాలయంనుంచి రాత్రి సామర్లకోట రైల్వేస్టేషన్ ఉన్నతాధికారులకు ఉత్తర్వులు అందాయి.ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు డిసెంబరు 8 రాత్రి నుంచి డిసెంబరు 30 వరకూ విశాఖ-సికింద్రాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించనున్నాయి.

●07097 నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ స్టేషన్ నుంచి సాయంత్రం 4.35గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు విశాఖ వెళ్తుంది. ఈ రైలు డిసెంబరు 8, 15, 22, 29 తేదీల్లో సికింద్రాబాద్ నుంచి బయలుదేరుతుంది.

●079098 నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రై లు విశాఖ నుంచి రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11.15 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుంది. ఈ రైలు డిసెంబరు 9, 16, 23, 30 తేదీల్లో విశాఖ నుంచి బయలుదేరుతుంది

బ్రహ్మపూర్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లు

● 07028 నెంబరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు బ్రహ్మపూర్‌నుంచి సాయంత్రం 4.45 గంట లకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11.35గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుంది. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు డిసెంబరు 14, 21, 28 తేదీల్లో బ్రహ్మపూర్ నుంచి బయలుదేరుతుంది.

● 07027 నెంబరు ప్రత్యేక రైలు సికింద్రాబాద్ నుంచి రాత్రి 8.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2.45గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. ఈ రైలు డిసెంబరు 8, 15, 22, 29 తేదీల్లో సికింద్రాబాద్‌నుంచి బయల్దేరుతుంది. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి, అనకా పల్లి, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, పలాస, ఇచ్ఛాపురం స్టేషన్లలో హాల్ట్ ఉన్నట్లు తెలిపారు.

షష్ఠి ఉత్సవాల్లో ఉద్రిక్తత

» ఇరువర్గీయులకు గాయాలు

ఆత్రేయపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరంలో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత దారితీసింది. తీర్థంలో రెండు సామాజిక వర్గాల యువకులు మాటామాటా పెరిగి ఘర్షణపడ్డారు. ఇది కాస్తా ఉద్రిక్తతకు దారితీయడంతో రెండువర్గాలకు చెందిన వారు దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో గాయపడిన ఇరువర్గాలకు చెందిన వారిని 108 అంబులెన్స్ ద్వారా కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము ఆధ్వర్యంలో సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పెద్దలతో శాంతి చర్చలు నిర్వహించారు. క్షతగాత్రులు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం.. (ఇన్‌సెట్)లో శ్రీపాదశ్రీవల్లభుడు

ఇక్కడ కొబ్బరి కాయలు కొట్టరు..

కడతారు

ఆ ఆలయానికి వెళ్తే మనం ఆంధ్రాలో ఉన్నామా.. లేక.. వేరే రాష్ట్రంలో ఉన్నామా అనే భావన కలుగుతుంది. ఎందుకంటే అక్కడ మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, వెస్ట్‌బెంగాల్ వంటి రాష్ట్రాలనుంచి భక్తులే ఎక్కువగా కనిపిస్తారు. అదే పిఠాపురంలో దత్తాత్రేయుడి మొదటి అవతారమైన శ్రీపాదశ్రీవల్లభుడి మహాసంస్థానం.. తూర్పు, ఉత్తరాది భక్తులకు ఇది ప్రత్యేకమైన ఆలయం.. ముఖ్యంగా మహారాష్ట్ర భక్తులు మరీ ఎక్కువగా వస్తుంటారు. ఇక్కడ కొబ్బరికాయ కొట్టకుండా కట్టడం ప్రత్యేకత. ఇక్కడి ఔదంబర వృక్షానికి భక్తులు కొబ్బరి కాయ కట్టి తమ కోర్కెను చెప్తే నెరవేరుతుందని వారి నమ్మకం. ఈనెల 8నుంచి 14 వరకు దత్త జయంతి సప్తాహ మహోత్సవాల సందర్భంగా ఈ ఆలయం విశేషాలపై ప్రత్యేక కథనం..

» ఇక్కడ ఇదొక ప్రత్యేకత
» పిఠాపురంలో దత్తాత్రేయుడి ప్రథమ అవతారం శ్రీపాదశ్రీవల్లభుడి మహాసంస్థానం
» ఏడాదికి ఒక్కసారైనా వచ్చే మహారాష్ట్ర, ఉత్తరాది భక్తులు
» మరాఠీలకు ఇలవేల్పు శ్రీపాదుడు
» నేటినుంచి 14 వరకు సప్తాహాలు

పిఠాపురం, డిసెంబరు 7: శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో ఉంది. ఇక్కడకు మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాలు, కర్నాటక నుంచి వచ్చే భక్తులు వస్తున్నారు. మరాఠీలు శ్రీపాదులు వారిని ఇలవేల్పుగా భావిస్తారు. దీంతో మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాల భక్తులు ఏటా ఒక్కసారైనా ఈ క్షేత్రానికి తరలివస్తారు. ఒకప్పుడు ఈ క్షేత్రానికి వచ్చే భక్తుల్లో వీరే 90శాతానికి పైగా ఉండేవారు. ఇప్పుడు పిఠాపురం ఎమ్మెల్యేగా పవన్‌కల్యాణ్ పోటీ చేయడం.. ఆయన డిప్యూటీ సీఎం కావడంతో ఇతర రాష్ట్రాలను ప్రాచుర్యం పొంది భక్తులు తరలివస్తున్నారు. ఏటా 20లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా. ఏటా గురువారాలు, చిత్తనక్షత్రం వచ్చే రోజులతోపాటు శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు, దత్త జయంతి ఉత్సవాలు, విజయదశమి, ఇతర పర్వదినాల సమయాల్లో భక్తుల రద్దీ ఉంటుంది. ఇక్కడ జరిగే పూజలు, గోపూజ, దత్త హోమం, మండలాభిషేకపూజ, శనిప్రదోష పూజ, నవగ్రవహోమం, లక్ష్మీగణపతిహోమం, చండీ పారాయణ, చండీహోమం, మహా మృత్యుంజయహోమం, అనఘా దత్తవ్రతం, పల్లకీసేవల్లో భక్తులు పాలుపంచుకుంటారు.

కొబ్బరికాయ కడితే కోర్కె నెరవేరినట్లే..

అన్నిక్షేత్రాల్లో మాదిరిగా శ్రీపాదశ్రీవల్లభుడికి కొబ్బరికాయ కొట్టరు. శ్రీపాదుడు కొలువై ఉన్న ఔదంబర వృక్షానికి కొబ్బరికాయలను కడతారు. కొబ్బరికాయలను కట్టి వేలాడతీసి ఔదంబర వృక్షం చుట్టూ ప్రదిక్షణాలు చేసి శ్రీపాదుడిని తమ కోర్కెలు నెరవేర్చమని కోరుకుంటారు. కోర్కెలు నెరవేరిన తర్వాత మళ్లీ వారు శ్రీపాదశ్రీవల్లభుడిని దర్శించుకుని పూజలుచేస్తారు. ఇక్కడ అభిషేకాలు, ఇతర పూజలు నిర్వహించిన భక్తులకు ప్రసాదంగా కొబ్బరి కాయలనే ఇస్తారు. వీటిని భక్తులు ఇక్కడ కొట్టకుండా ఇంటికి పట్టుకెళ్లి శ్రీపాదశ్రీవల్లభుని స్మరించుకుని కొట్టి దాన్ని ప్రసాదంగా స్వీకరించాలని అర్చకులు పూజల సందర్భంగా చెబుతారు.

మాత్రం ఇక్కడ చెప్పరు. సామాన్యుల్లానే శ్రీపాదుని దర్శించుకుని పూజల్లో పాల్గొంటారు. కీలకహోదాల్లో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, న్యాయమూర్తులు ఇదే పద్ధతిని పాటిస్తారు. కొందరు ఇక్కడ ఆలయ వసతిగృహాల్లోనే బస చేసి అన్న ప్రసాదాలను స్వీకరిస్తారు.

వారి విరాళాలే

ఆలయానికి వచ్చే విరాళాలు అధికశాతం మహారాష్ట్ర, ఉత్తరాది భక్తుల నుంచే వస్తున్నాయి. మహారాష్ట్ర భక్తులు తమ సంపాదనలో కొంతభాగాన్ని పక్కకు తీసి ఇక్కడకు వచ్చినప్పుడు విరాళంగా అందజేస్తారు. ఇక్కడ నిర్మించిన భవనాలు, ఇతర సౌకర్యాల కల్పనకు అందిన విరాళాల్లో వీరిదే సింహభాగం. భక్తులకు ఆలయప్రాంగణంలోనే ఉచిత వసతి ఉంది.


శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో ఔదంబర వృక్షానికి కొబ్బరికాయలు కడుతున్న భక్తులు


పూజల్లో పాల్గొన్న మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల భక్తులు

నమ్మకమే నడిపిస్తుంది

భక్తులకు శ్రీపాదశ్రీవల్లభుడిపై ఉన్న నమ్మకమే ఇటువైపు నడిపిస్తుందని మహారాష్ట్ర, కర్నాటక, గోవా, ఉత్తరాది తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు చెబుతున్నారు.ఈ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు ఎంత ఉన్నతస్థాయిలో ఉన్న వారైనా తమ హోదాను

కోర్కెలు నెరవేరతాయని నమ్మకం

-నాగాభట్ల రాంబాబు, అర్చకులు



శ్రీపాదశ్రీవల్లభునికి నారీకేళ అర్పణ చేస్తే కోర్కెలు నెరవేరతాయని, మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. ఔదంబర వృక్షానికి నారీకేళం కడతారు. అనుకున్న కోర్కెలు నెరవేరిన తర్వాత ఇక్కడకు మళ్లీ వచ్చి స్వామికి జరిగే పూజల్లో, అన్నదానాల్లో పాలుపంచుకుంటారు. శతాబ్దాలుగా నారీకేళాన్ని కట్టే పద్ధతి ఇక్కడ ఆచారంగా ఉంది.

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

-ఆర్.సౌజన్య, కార్యనిర్వహణాధికారి, శ్రీపాదశ్రీవల్లభ సంస్థానం

మహారాష్ట్ర, కర్నాటక, ఉత్తరాది, ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా వస్తున్నారు. వీరందరికీ ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. కొబ్బరికాయలను ఔదంబర వృక్షానికి కట్టడం ఇక్కడ ఆచారంగా వస్తోంది. ఇందుకు అనుగుణంగా భక్తులకు కొబ్బరికాయలను అందుబాటులో ఉంచుతున్నాం. దేవస్థానం కౌంటర్ ద్వారా విక్రయిస్తున్నాం.



నేటి నుంచి దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు

పిఠాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన పిఠాపురం పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో ఆదివారంనుంచి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 14వరకూ జరిగే ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దేశంలోని వివిధప్రాంతాలనుంచి భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు అధికంగా తరలివస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు విస్తృతఏర్పాట్లు చేశారు. తొలిరోజు ఆదివారం నుంచి 14వ తేదీ దత్తజయంతి వరకూ ప్రతిరోజూ మహాగణపతిపూజ, కలశ స్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మాలకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, హారతులు, స్వామికి పల్లకీసేవ జరుగుతాయి.

రోజువారీ కార్యక్రమాలు..

ఆదివారం ఉదయం దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు సర్వపుష్పపూజ, 9న లక్షబిల్వార్చన, 10న సహస్ర చామంతి పూజ, 11న లక్ష తులసి అర్చన, 12న సహస్ర లిల్లీ పుష్పపూజ, 13న గులాబి అర్చన, సంపెంగ పుష్పపూజ, 14న పూలంగిసేవ, బిల్వార్చన, పూర్ణాహుతి జరుగుతాయి. దత్తజయంతి రోజు సాయంత్రం దత్తాత్రేయస్వామి రథోత్సవం నిర్వహిస్తారు. దత్తజయంతి సప్తాహ మహోత్సవాల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర, ఉభయ తెలుగురాష్ట్రాలు, కర్నాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు. మహోత్సవాలకు తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు.

సఫాయి కర్మచారుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు

» జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశన్



అమలాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఫాయి కర్మచారుల అభ్యున్నతికోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని జాతీయ కమిషన్ చైర్మన్ ఎం. వెంకటేశన్ అన్నారు. ఆయా పథకాల ద్వారా వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి జీవనోపాధుల కల్పనకు కృషి చేయాల్సి బాధ్యత అధికారులకు ఉందన్నారు. కలెక్టరేట్‌లో శనివారం పంచాయతీ రాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య, బ్యాంకింగ్, విద్య, కార్మిక, పోలీసు అధికారులతోపాటు సఫాయి కర్మచారి కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సఫాయి కర్మచారులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చిట్టచివరి లబ్ధిదారుడికి సైతం సంక్షేమ పథకాల లబ్ధి చేరేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. సఫాయి కర్మచారి కార్మికుల పరిస్థితులను జాతీయస్థాయిలో కమిషనర్ పరిశోధించి కేంద్ర ప్రభుత్వానికి పలు సిఫార్సులు చేయనున్నట్టు వెల్లడించారు. అసమానతలు లేకుండా సఫాయి కార్మికులు అన్నివిధాలా ఎదిగేలా సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో కూడిన పనిముట్లు అందించాలన్నారు. కర్మచారీ కార్మికులకు పీఎంఏవై, టిడ్కో పథకాల ద్వారా గృహాలు మంజూరు చేయాలని సూచించారు. సెప్టిక్ ట్యాంకు వాహనాలు సమకూర్చిన వారికి లిక్విడ్ వేస్ట్ అన్‌లోడింగ్‌కోసం ట్రీట్మెంట్ ప్లాంట్లను రాబోయే రెండు నెలల్లో అందుబాటులోకి తేవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పారిశుద్య పనులు చేసేవారి ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వారికి కనీస వేతనాలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్మోహనరావు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

పారదర్శకంగా నిర్వహించాలి

» కాకినాడ జేసీ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న జరిగే ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి ఏఆర్వో, కాకినాడ జేసీ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానం, ప్రాథమిక దశ ఓట్ల లెక్కింపు, డీటెయిల్డ్ కౌంటింగ్, రిజెక్టెడ్, డౌట్‌ఫుల్ ఓట్లు, కౌంటింగ్ ఏజెంట్లు వంటి ఇతర అంశాలపై కౌంటింగ్ అబ్జర్వర్లు, సూపర్‌వైజర్లు ఓట్ల లెక్కింపు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5న తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గం సంబంధించిన పోలింగ్ ప్రక్రియ జరిగిందన్నారు. ఈ పోలింగ్ ప్రక్రియలో 15,490 ఓట్లు నమోదయ్యాయన్నారు. బ్యాలెట్ బాక్స్‌లను కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో భద్రపరిచారన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఉదయం 6గంటలకే కేంద్రానికి చేరుకోవాలన్నారు. 14 టేబుల్స్‌పై 9రౌండ్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపులో ఎలాంటి గందరగోళ పరిస్థితులు నెలకొనకుండా లెక్కింపు ప్రక్రియ అంతా పారదర్శకంగా, సజావుగా జరిగేందుకు కౌంటింగ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. తొలిదశలో ప్రాథమిక ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం డిటెయిల్డ్ కౌంటింగ్ జరుగుతుందన్నారు. లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానం, ప్రాథమిక దశ ఓట్ల లెక్కింపు, డిటెయిల్డ్ కౌంటింగ్, రిజెక్టెడ్, డౌట్‌ఫుల్ ఓట్లు, కౌంటింగ్ ఏజెంట్లు విధులు వంటి ఇతర అంశాలపై కేఎస్ఈజెడ్ ఎస్డీసీ రామలక్ష్మి, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణ కార్యక్రమంలో కౌంటింగ్ అబ్జర్వర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కాకినాడలో ముగిసిన ప్లాస్టిక్ సర్జరీ సదస్సు

» తెలుగు రాష్ట్రాల నుంచి 300 మంది వైద్యులు
» కొత్త పరిశోధనలు, సర్జరీలకు శ్రీకారం




వైద్యసదస్సులో పాల్గొన్న వైద్యనిపుణులు.. సదస్సు ముగింపులో మాట్లాడుతున్న డీఎంఈ డాక్టర్ నరసింహం

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్, రీకనస్ట్రక్టివ్ అండ్ అస్తటిక్ సర్జన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా (ఏపీఆర్ఏఎస్‌సీవోఎన్)-2024 ఆధ్వర్యంలో కాకినాడలో మూడురోజులుగా జరుగుతున్న 21వ యాన్యువల్ సదస్సు శనివారం ముగిసింది. ముగింపు వేడుకల్లో ముఖ్యఅతిథులుగా డీఎంఈ, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం, ఏపీ మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ పీవీ సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహం మాట్లాడుతూ వైద్య సదస్సులు, సెమినార్లలో పాల్గొనడం ద్వారా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చన్నారు. వైద్యరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వైద్యులు వృత్తి నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఈ సదస్సుల ద్వారా కొత్త విషయాలు నేర్చుకోవడం, మనం నేర్చుకున్న విషయాలను గ్రూపులో ఒకరికొకరు చర్చించుకోవడంతో కొత్త ఆవిష్కరణలకు వీలుంటుందన్నారు. ఈనెల 5న కెడావర్ శస్త్ర చికిత్స, ఫిల్లర్స్, బొటాక్స్, థ్రెడ్ లిఫ్ట్ తదితర వాటిపై ప్రదర్శన, డిమానిస్ట్రేషన్, 6, 7 తేదీల్లో ప్లాస్టిక్ సర్జరీల్లో వస్తున్న కొత్త పోకడలు, నూతన ఆవిష్కరణలపై సైంటిఫిక్ సెషన్లు నిర్వహించామని ఏపీఆర్ఏఎస్‌సీఓఎన్ అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జన్ హెచ్‌వోడీ డాక్టర్ బి.రత్నభూషన్ తెలిపారు. ఈ సదస్సులో దేశంలో ఉన్న నిష్ణాతులైన ప్లాస్టిక్ సర్జరీ వైద్యనిపుణులు హాజరై లైవ్‌గా మృతదేహాలపై శస్త్రచికిత్సలు నిర్వహించి అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో ఏపీఆర్ఏఎస్‌సీఓఎన్ ప్యాట్రిన్ డాక్టర్ కె.విష్ణుమూర్తి, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.ప్రవీణ, కార్యదర్శి డాక్టర్ ఎన్.రాంబాబు, ఏపీ, తెలంగాణాకు చెందిన ప్లాస్టిక్ సర్జరీ వైద్యనిపుణులు, 300మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గొల్లప్రోలు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో శనివారం జరిగిన గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మరణించాడు. గొల్లప్రోలు పట్టణంలోని దేవీనగరం ప్రాంతానికి చెందిన చేదులూరి పద్మరాజు అలియాస్ చంటబ్బాయి(58) కూలీ పని నిమిత్తం సైకిల్‌పై వెళ్తుండగా బైపాస్‌రోడ్డులో తాటిపర్తి పుంతరోడ్డు జంక్షన్ వద్ద కత్తిపూడి నుంచి పిఠాపురం వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చేదులూరి పద్మరాజు

కాకినాడ సెజ్ ద్వారా యనమలకు

ఆయాచిత లబ్ధి: వైసీపీ

సర్పవరం జంక్షన్(కాకినాడ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎస్ఈజడ్‌కు మొదటిగా భూమి ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసిచ్చింది అప్పటి స్థానిక ఎమ్మెల్యే యనమల రామకృష్ణుడని, సెజ్ ద్వారా యనమల ఆయాచిత లబ్ధి పొంది రైతులను మోసం చేశారని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా విమర్శించారు. శనివారం వైద్యనగర్‌లో వైసీపీ జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ వంగా గీతతోపాటు కొత్తపల్లి మండలం తొండంగి మండలానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు. సెజ్ కోసం సేకరించిన భూములను రైతులకు తిరిగి వెనక్కి ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఏరువాక పేరుతో రైతుల భూములు వెనక్కి ఇచ్చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, తర్వాత మాటతప్పి రైతులపై అక్రమ కేసులు, నిర్బంధాలతో వేధింపులకు గురి చేసి భూములను వెనక్కి లాక్కున్నారని విమర్శించారు. రైతులు దాడిశెట్టి నారాయణస్వామి, ప్రసాదరెడ్డి, సుబ్బిరెడ్డి, చింతా సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వమిచ్చిన డబ్బులు తీసుకోకుండా కోర్టులో కేసులు వేశామన్నారు. ఈ ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేవీ రావు, జీఎంఆర్‌లు భూములు తీసుకుని బ్యాంకులో తనకాపెట్టి రుణాలు తీసుకుని, ఆ డబ్బుతో భూములు కొనుగోలు చేసి వ్యాపారం చేశారని ఆరోపించారు.

ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు 18 మంది ఎంపిక


ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేరళలోని కాలికట్‌లో ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకూ జరిగే ఇంటర్ యూనివర్శిటీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు 18 మంది ఎంపికయ్యారని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. కళాశాల క్రీడామైదానంలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు శనివారంతో ముగిశాయి. పోటీల్లో మంచి ప్రతిభ చూపిన 18 మంది క్రీడాకారులను కాలికట్‌లో జరిగే ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు ఎంపిక చేశారు. అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో కాకినాడ ఐడియల్ కాలేజ్ ప్రథమ, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ద్వితీయ, రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తృతీయ, కొయ్యలగూడెం ప్రకాష్ కళాశాల నాలుగో స్థానంలోని నిలిచినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

వాడపాలెంలో ఓ ఇంట్లో చోరీ

» రూ.5లక్షల నగదు, ఐదు కాసుల బంగారం అపహరణ



కొత్తపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం వాడపాలెంలో ఇంట్లో ఎవ్వరి లేని సమయంలో చోరీకి పాల్పడి నగదు, బంగారు వస్తువులు గుర్తుతెలియని ఆగంతకులు దోచుకుపోయిన్నట్లు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మండల పరిధి వాడపాలెం గ్రామాని కి చెందిన శ్రీకాకోళపు సుమన్ తన తల్లితో కలిసి రాజోలు మండలం పొదలాడలో బంధువుల ఇంటికి శుభకార్యక్రమానికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఇంటికి చేరుకున్నారు. బీరువా తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి చూసేసరికి బీరువాలో ఉంచిన రూ.5లక్షల నగదు, 5కాసుల బంగారం మాయమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ సురేంద్ర సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని అమలాపురం నుంచి క్లూస్‌టీమ్, పోలీసుల జాగిలాలను రప్పించారు. దీనిపై సుమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేంద్ర తెలిపారు.

భూకంపం జోన్‌లో

పోలవరం

» మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు భూకంపం జోన్‌లో ఉందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ విద్యాసంస్థల్లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో గోదావరి పరీవాహక ప్రాంతాల్లోనే భూకంపం నమోదైందన్నారు. భూకంపాలు ఎప్పుడు వస్తాయో, ఎక్కడ వస్తాయో ఊహించలేమన్నారు. గోదావరి పరీవాహకప్రాంతం భూకంపం జోన్ -3లో ఉందని చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వం గైట్ బండ్ నిర్మాణాన్ని మేఘా కంపెనీకి అప్పగించారని ఆ కంపెనీ నాణ్యత పాటించకపోవడంతో గైట్ బండ్ కొట్టుకుపోయిందన్నారు. మళ్లీ అదే కంపెనీకి అప్పగించడం అభ్యంతరకరమన్నారు. భూకంపాలను తట్టుకుని నిలబడాలంటే డబుల్ డయాఫ్రంవాల్ తప్పకనిర్మించాలన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

10 నుంచి రెవెన్యూ సదస్సులు

పెద్దాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10 నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ ఓ ప్రకటనలో కోరారు. భూసంబంధమైన సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సదస్సులు ఈనెల 27 వరకూ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనాలి

కలెక్టర్ షాన్‌మోహన్



కలెక్టర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న రిలయన్స్ ప్రతినిధులు

కాకినాడ సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ గాడిమొగ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా విద్యార్థులకు శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ధీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను క్విజ్ పోటీల ద్వారా వెలికి తీసేందుకు రిలయన్స్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. క్విజ్ మాస్టర్ నేతృత్వంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. శంఖవరం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు వై బాలమురళి, ఎస్.స్వాతి విన్నర్స్‌గా నిలిచారు. వారికి 2 ల్యాప్‌టాప్‌లు అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన ఉండూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు సుధీర్, కుమార్, యువీ గీతా మాధురిలకు టాబ్స్ అందించారు. అదే విధంగా వెంకట్‌నగర్ మున్సిపల్ హైస్కూల్, పరదేశమ్మపేట ఎంసీ బాయ్స్ హైస్కూల్, కోటనందూరు జడ్పీ హైస్కూల్, రాపర్తి జడ్పీ హైస్కూల్, తొండంగి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు 10 సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో రిలయన్స్ సైట్ హెడ్ ఎల్ మురళీధర్, సీనియర్ హెడ్ పోతాప్రగడ సుబ్రహ్మణ్యం, ఎస్ ప్రియకుమార్, ఐ.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రీసర్వే సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి

కరప, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చేసిన రీసర్వేలో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు రైతులు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కి విజ్ఞప్తిచేశారు. కరపమండలం అరట్లకట్ట హైస్కూల్‌కు విచ్చేసిన కలెక్టర్‌ను శనివారం పలువురు రైతులు కలిసి రీసర్వే వల్ల తామెదుర్కొంటున్న భూ సమస్యలను వివరించారు. అన్నవరం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు, ఆదర్శ రైతు చాగంటి సూరిబాబు మాట్లాడుతూ తమ కుటుంబంలోని అందరి భూములకు రీసర్వే సమయంలో జాయింట్ ఎల్‌పీఎం ఇచ్చారన్నారు. ఇప్పుడు ఆ భూములను సబ్‌డివిజన్ చేయడానికి ఎల్‌పీఎం నెంబరు సైట్ ఓపెన్ కావడంలేదన్నారు. ఈ దుస్థితి మండలవ్యాప్తంగా పలువురు రైతులు ఎదుర్కొంటున్నారని, దీని వల్ల భూముల క్రయవిక్రయాలు నిలిచిపోయాయని, పెళ్లిళ్ల, ఇతర ఆర్థికపరమైన అవసరాలు తీరక నానా ఇబ్బందులు పడుతున్నామని మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించి కలెక్టర్ ఈ వారంలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

దుప్పట్లు,రైస్ బ్యాగ్‌ల పంపిణీ

కాకినాడ సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ నందమూరి తారకరామారావు సినీ వజ్రోత్సవ వేడుకలు పురస్కరించుకుని కాకినాడలో శనివారం నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50మంది పేదలకు దుప్పట్లు, 5 కిలోల రైస్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, ఉపాధ్యక్షుడు చెకుకూరి సాయిరాంవర్మ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఫౌండేషన్ చైర్మన్ సుబ్బు మాట్లాడుతూ ఈ నెల 14న నిర్వహించనున్న వజ్రోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని కోరారు. ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజ్ ద్వారా పేదలకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా కార్యదర్శి ఉదయ్‌కుమార్, ప్రచార కార్యదర్శి అనిల్‌కుమార్, ఫౌండేషన్ ప్రతినిధులు బత్తుల సూర్యప్రసాద్, కర్రి వీరబాబు, మండపాక సత్యనారాయణ, అడపా జగదీష్,మండపాక సీతామహాలక్ష్మి ఉన్నారు.

కరప హైస్కూల్‌కు బెంచీలు

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంక్ సీఎస్ఆర్ యాక్టివిటీస్‌లో భాగంగా కరప జిల్లా పరిషత్ హైస్కూల్‌కి రూ.3లక్షలు విలువచేసే 42 డ్యూయల్ డస్కులు ఇచ్చేందుకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో శిక్షణ పొందుతున్న వెల్డర్ స్టూడెంట్స్‌తో ప్రభుత్వ ఐటీఐకి రెవెన్యూ జనరేషన్‌లో భాగంగా తయారుచేయించారు. కరప స్కూల్‌కి బ్యాంకు సిబ్బంది ఆధ్వర్యంలో అందజేయడానికి సిద్ధంగా ఉంచారు. కెనరా బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, రీజనల్ ఆఫీస్ మేనేజర్ పద్మరాజు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవిజి వర్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో జనరిక్ మందుల దుకాణం మూసివేతపై ఆందోళన

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జనరిక్ మందుల దుకాణం మూసివేయడంపై రోగులు, బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదల కోసం ప్రభుత్వం జనరిక్ మందుల దుకాణాన్ని ఏర్పాటు చేసిందని, దుకాణం మూసివేసి ఉంచడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. తక్షణం జనరిక్ మందుల దుకాణం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా షష్ఠి వేడుకలు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు







కొత్తపల్లి: కొమరగిరిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కాకినాడరూరల్: సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పాలాభిషేకం, పిఠాపురంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారం

పిఠాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలయాల్లో శనివారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు వైభవంగా జరిగాయి. పాదగయలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు జరిగాయి. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు. కూచివారి వీధిలో వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి వేడుకలు ఘనంగా జరిగాయి. రాత్రి కళ్యాణం నిర్వహించారు. గ్రామోత్సవం ఘనంగా జరిగింది.

పిఠాపురం రూరల్: మండలంలోని గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి ఘనంగా జరిగింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు దర్శనానికి బారులు తీరారు. మల్లాంలోని ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం జరిగింది. చిత్రాడ సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు దర్శించుకున్నారు.

కరప: గొర్రిపూడి తుల్యభాగ నదీతీరన వేంచేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు బి.వీరవెంకట సత్యనారాయణ, శివకుమార్‌లు స్వామివారికి పూజలు నిర్వహించారు. కోలసంబరం, బుర్రకథ, ఆర్కెస్ట్రా ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి ఆలయ ధర్మకర్త గండి వెంకట్రాజు, రమాదేవి దంపతులు స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కరప వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్త చాగంటి వెంకట్రావు తదితరులు పూజలు చేసి కల్యాణం నిర్వహించారు. కరప-పెనుగుదురులో సిరిపురానికి చెందిన వ్యాపారవేత్త చిక్కాల దొరబాబు,సుబ్బారావు సోదరులు నిర్మించిన 51 అడుగుల వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వేదపండుతల మంత్రోచ్చరణల నడుమ ఆగమ శాస్త్రం ప్రకారం చిక్కాల దొరబాబు దంపతులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలోసుమారు 15 వేల మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

గొల్లప్రోలు: పట్టణంలోని కొత్తపేటలో వల్లీదేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం శూలాల సంబరం జరిగింది. ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అభిషేకాలు నిర్వహించారు. దుర్గాడ శివాలయంలో కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఏకాదశ సర్పసూక్త అభిషేకం జరిగింది.

కొత్తపల్లి: కొత్తపల్లి శ్రీబాలా త్రిపురసుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పాలభిషేకాలు నిర్వహించారు. కొమరగిరిలో శ్రీసుబ్రహ్మణ్యస్వామికి పూర్ణరజిత కవచ అలంకరణ చేశారు. భక్తులు సుబ్రహ్మణ్యస్వామికి పాలు, నెయ్యితో అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పెద్దాపురం: చదలాడ, జి.రాగంపేట గ్రామాల్లో షష్ఠి వేడుకలను వైభవంగా నిర్వహించారు. అమరిగిరిపై సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాలకు భక్తులు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. జి.రాగంపేట, చదలాడ గ్రామాల్లో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు) దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వర్థులవారి వీధిలో భువనేశ్వరీ పీఠంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం పీఠాధిపతి చింతా గోపీశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కాకినాడరూరల్: ఇంద్రపాలెంలోని శ్రీమందేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దివ్యకల్యాణాన్ని నిర్వహించినట్లు ఆలయ ఈవో జోగా సత్యనారాయణ తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయం వద్ద విద్యుత్ కాంతులు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నప్రసాదవితరణ జరిగింది. ఎస్పీ ఆదేశాలతో ఇంద్రపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం నందు పోలీస్ బందోబస్తు విధుల్లో భాగంగా డ్రోన్, బాడీవార్న్ కెమెరాలను పోలీసులు వినియోగించారు. నేరాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, భక్తుల భద్రత అంశాలపై నిఘాకోసం డ్రోన్, బాడీవార్న్ కెమెరాలను వినియోగిస్తూ అవాంఛనీయ సంఘటనలకుతావు లేకుండా భక్తులకు సహకారంగా బందోబస్తు నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు.

సామర్లకోట: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని ఉపాలయం వద్ద పూజలు ఘనంగా నిర్వహించారు. పనసపాడు గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో జరిగిన పూజలలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. అర్చకులు వేదస్వస్తితో ప్రసాదాలు స్వీకరించారు. ఉండూరు గ్రామంలో సుబ్బారాయుడి గుడిలో పూజలు జరిగాయి. కుడా చైర్మన్ తుమ్మల బాబు, జనసేన నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

తాటిపర్తిలో ఎస్పీ పూజలు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తాటిపర్తిలో స్వయంభూగా వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలకగా ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ శేషవస్త్రాలతో సత్కరించారు. బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ పర్యవేక్షించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఉన్నారు. తాటిపర్తి, మల్లవరంలోని ఆలయాల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పూజలు చేశారు.

సంక్రాంతికి ముందే పండుగ వాతావరణం

ఎమ్మెల్యే చినరాజప్ప



వేట్లపాలెంలో పనులను పరిశీలిస్తున్న రాజప్ప

సామర్లకోట, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): పల్లె పండుగ పేరిట ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు నాణ్యతా ప్రమాణాలతో శరవేగంగా నిర్మిస్తూ సంక్రాంతి పండుగకు ముందుగానే కొత్త రోడ్లతో పండుగ వాతావరణం తీసుకొస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చెప్పారు. నియోజకవర్గంలో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలలో భాగంగా రూ.10 కోట్లతో సామర్లకోట మండలంలో వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను శనివారం రాజప్ప ఆయా గ్రామాల టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. వేట్లపాలెంలో రైటుగట్టు ఆవలి వైపున కొత్తచెరువు గట్టు నుంచి బీసీ కాలనీ అమ్మవారి ఆలయం వరకూ నిర్మించిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మళ్ళ రామకృష్ణ, నవీన్ చిల్లి మోహనరావు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక చేయూత

కరప, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విశ్రాంత అధికారి ఔదార్యంతో కరపలోని పలువురి బాధితులకు ఆర్థిక చేయూత లభించింది. గ్రామ మాజీసర్పంచ్ పోలిశెట్టి తాతీలు సూచన మేరకు విశ్రాంత లేబర్ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు కొత్తపేటలో గొంతు కాన్సర్‌తో బాధపడుతున్న దేవు బాబూరావుకు మందుల నిమిత్తం రూ.10వేలు అందజేశారు. మెరకవీధికి చెందిన ఉప్పలపాటి వెంకన్నబాబు హెర్నియా ఆపరేషన్ చేయించుకోగా అతడి మందుల కోసం రూ.5వేలు, రెడ్డి పోతురాజు అనే దివ్యాంగుడి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ కోసం రూ.10వేలు, షుగర్ వ్యాధితో కాలు కోల్పోయిన గొల్లపల్లి నరసింహమూర్తికి రూ.10వేలు చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేసి పాసు పుస్తకాలనందజేశారు. శ్రీనివాసరావుకు తాతీలు, వార్డు సభ్యుడు పేవకాయల శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఎంసీ చైర్మన్ పదవికి చిన్నా రాజీనామా

పెద్దాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌బీ పట్నం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ మన్యం చిన్నా తన పదవికి శనివారం రాజీనామా చేశారు. తన ప్రమాణ స్వీకార సమయంలో అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని ప్రమాణం చేశానని, కానీ స్థానిక నాయకుల తీరు నచ్చని కారణంగా తాను మనస్థాపానికి గురై రాజీనామా చేశానన్నారు. తన రాజీనామా లేఖను పాఠశాల హెచ్ఎంకు అందజేశానని తెలిపారు.

19న 'చలో అమరావతి'

పిఠాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేఖంగా ఈనెల 19న తలపెట్టిన చలో అమరావతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ కోరారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద హలో దళిత్-చలో అమరావతి పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ, జిల్లా ఇన్‌చార్జి రాజాల నాగేశ్వరరావు, మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రామచంద్రరావు, సీపీఐ జిల్లా నాయకుడు సాకా రామకృష్ణ, దడాల అజిత్, ఏలేటి విఘ్నేశ్వరరావు, కొల్లం రవికుమార్, బోడపాటి లక్ష్మీ పాల్గొన్నారు.

రేపు భగవద్గీతపై మౌఖిక పరీక్ష

సర్పవరం జంక్షన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్తు రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో ఈనెల 9న కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ రహదారిలో గల సత్యశావాహని లో గీతా జయంతి సందర్భంగా విద్యార్థులకు భగవద్గీతపై మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్నట్టు సభ్యులు తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి 6,7,8, 9వ తరగతి విద్యార్థులకు భగవద్గీత (ఆత్మ సంయమయోగ) లోని 6వ అధ్యాయంపై పరీక్ష జరుగుతుందన్నారు. సంపూర్ణ భగవద్గీత 18ఏళ్ల లోపు పిల్లలకు 700 శ్లోకాలు, 18ఏళ్లు దాటి 60 లోపువారికి 700 శ్లోకాలపై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 9391977129 నెంబర్‌కు ఫోన్ చేయాలని వారు సూచించారు.

విద్యాభివృద్ధికి అందరూ తోడ్పాటునందించాలి

డీఈవో పిల్లి రమేష్

మెగాపేరెంట్ టీచర్స్ సమావేశాలు



పెద్దాపురం: విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందచేస్తున్న డీఈవో రమేష్



సామర్లకోట: మాధవపట్నం పాఠశాలలో తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్న ఆర్జేడీ నాగమణి

పెద్దాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్‌లు అందరూ సమష్టిగా తోడ్పాటునందించాలని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని పద్మనాభా కాలనీలో ఉన్న బాలికల పాఠశాలలో నిర్వహించిన మెగాపేరెంట్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం నిర్వహించిన టగ్ ఆఫ్ వార్, ముగ్గుల పోటీలు, మ్యూజిక్ చైర్ పోటీలను ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందచేశారు. కార్యక్రమంలో డీవైఈవో ప్రభాకర శర్మ, ఎంఈవో చౌదరి పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తల్లిదండ్రులు -ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు విద్యాభివృద్ధికి, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో దోహదపడనున్నాయని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో శనివారం జరిగిన ఈ సమావేశాల్లో తాను హాజరుకాలేక పోయానన్నారు. అయితే కాకినాడ నగరంలో ఈ సమావేశాలు విజయవంతంగా సాగాయన్నారు. ఇటువంటి సమావేశాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల చదువు, నడవడిక వంటికి తల్లిదండ్రులకు తెలుస్తాయన్నారు. రాష్ట్రంలో ఓ మంచి కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ శ్రీకారం చుట్టారని చెప్పారు.

పిఠాపురం: పిఠాపురం పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో గల జిల్లాపరిషత్, ప్రభుత్వ, మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మెగా టీచర్, పేరెంట్స్ సమావేశాలు పండుగ వాతావరణంలో జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించారు. పాఠశాల విద్యాకమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామర్లకోట: మండలంలోని 75 ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగాపేరెంట్-టీచర్ సమావేశాలు పండగ వాతావరణంలో వేడుకలు నిర్వహించారు. మాధవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశాల్లో విద్య ఆర్జేడీ నాగమణి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. సామర్లకోట అయోధ్య రామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్, సర్వశిక్ష అభియాన్ సీఎంవో చామంతి నాగేశ్వరరావు, సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావులు ముఖ్యఅతిధులుగా హాజరై ప్రభుత్వ విద్యా పథకాలను వివరించారు.

సర్పవరంజంక్షన్: క్రమశిక్షణతో విద్యాభ్యాసం సాగించి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని... గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల జోలికెళ్లి చేజేతులా బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు కోరారు. తిమ్మాపురం హైస్కూల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వద్ద బ్రో కార్యక్రమం పోస్టర్స్‌ని ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాలకువ్యతిరేకంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏపీఎస్పీ హైస్కూల్లో విద్యాశాఖ, హైస్కూల్ హెచ్ఎం కె.గాయత్రి ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో పసుపులేటి శ్రీనివాస్ హాజరయ్యారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. 1000 మందికి ఐడీ కార్డులను పంపిణీ చేసేందుకు కృషి చేసిన ఇంటర్‌మీడియెట్ ఇన్‌చార్జి కందుకూరి పాల్‌రాజుని ఎంఈవో ఏసుదాసు, ఎస్ఎస్ఏ ఏఎస్‌వో జోగిరెడ్డిలు అభినందించారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ కర్రి దుర్గాదేవి, వైస్ చైర్మన్ పోలినాటి రమణకుమార్, పాఠశాల ఇన్‌చార్జి సత్యవోలు శ్రీనివాస్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో మెగాపేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. నీలపల్లి, తాళ్లరేవు, జి.వేమవరం, చినబొడ్డువెంకటాయపాలెం, చొల్లంగిపేట, పిల్లంక హైస్కూల్స్‌లో విద్యార్థులకు డ్రాయింగ్, క్రీడాపోటీలు జరిగాయి. తల్లిదండ్రులతో ముగ్గుల పోటీలు, తాడాట, త్రోబాల్ ఆటలను ఆడించారు. విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కొత్తపల్లి: మండలంలో 11 ఉన్నత పాఠశాలలు, 53 ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాలలు, 3 ప్రాథిమికోన్నత పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ జరిగాయి. ఉప్పాడ కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో సమావేశంలో మధ్యాహ్నభోజన పథకంలో చక్ర పొంగలి, బీన్స్, బంగాళాదుంప కర్రీ, పప్పు, సాంబారుతో భోజనాలు వడ్డించారు. దీంతో విద్యార్థులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

సెజ్ రైతులను నిలువునా ముంచిన జగన్

మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ సెజ్ రైతులను నిలువునా ముంచింది జగన్, అతని తండ్రి రాజశేఖరరెడ్డి అని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి పాదయాత్ర చేసే సమయంలో ఇక్కడి భూములపై కన్ను పడిందన్నారు. ఓఎన్‌జీసీని అడ్డుపెట్టుకుని రైతులు నుంచి బలవంతంగా భూములు తీసుకున్నారని తెలిపారు. అనంతరం ఓఎన్‌జీసీని పక్కనబెట్టి ప్రవేటు వ్యక్తులకు సెజ్‌ను కట్టబెట్టారని విమర్శించారు. ఇప్పుడు అదే సంస్థ రిఫైనరీ పెట్టేందుకు భూములు కావాలని ముందుకు వచ్చిందని, దీనిని బట్టే అప్పుడు జరిగింది ఏమిటో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఎకరం రూ.3లక్షలకు భూములు లాక్కొరన్నారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తాను ఎమ్మెల్యేగా ఉండగా ఎకరానికి అదనంగా రూ.2లక్షలు వంతున రూ.160కోట్లు అదనంగా పరిహారంగా అందజేశామని వివరించారు. తాను అధికారంలోకి వస్తే సెజ్‌ను రద్దు చేసి రైతుల భూములను వెనక్కి ఇస్తామని ప్రకటించారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 2వేల ఎకరాలను మాత్రమే ఇస్తామని చెప్పి అందులో సగమే రైతులకు అప్పగించారని చెప్పారు. ఇలా అప్పగించిన భూములను తక్కువ ధరకే నాటి వైసీపీ ప్రజాప్రతినిధులు లాక్కొన్నారని వర్మ ఆరోపించారు.

మధ్యవర్తిత్వంతో కేసులకు సత్వర పరిష్కారం

అదనపు జిల్లా జడ్జి వాసంతి

పిఠాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కేసులను సత్వరం పరిష్కరించుకోవడానికి వీలవుతుందని, తద్వారా సమయం ఆదా అవుతుందని, ఈ విషయంపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి తెలిపారు. పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో బార్ అసోసియేషన్ సభ్యులయిన న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై శనివారం అవగాహన కల్పించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షుడు ఎం.రాజారావు, కేఎస్‌భాస్కర్, ఎస్ఎం ఆలీ పాల్గొన్నారు.

కాకినాడ పరిసరాల్లో విమానాశ్రయాన్ని నిర్మించాలి

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 7(ఆంధ్ర జ్యోతి): కాకినాడ పరిసర ప్రాంతాల్లో విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికుల సంఘ అధ్యక్షుడు వైడీ.రామారావు పేర్కొన్నారు. గాంధీ భవన్‌లో తూర్పుగోదావరిజిల్లా, కాకినాడ సిటీ ప్రయాణికుల సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. రామారావు మాట్లాడుతూ అన్నవరం, కాకినాడ, కోటిపల్లి, నర్సాపురం, బాపట్లకు కొత్త రైలు మార్గం నిర్మించాలని గతం నుంచి ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు.కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌కు బదులుగా కాకినాడ సిటీ జంక్షన్‌గా మార్చాలన్నారు. ఈ అంశాలను సమావేశం తీర్మానించింది.



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

కంచాలు అందజేత

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థులు కంచాలు అందించారు. పాఠశాలలో శనివారం జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో పూర్వ విద్యార్థులు బుద్దాల చంటిబాబు, ఓరుగంటి సూర్యనారాయణ, పోసిన రవి, సోమరౌతు మురళీమోహన్, పడాల నాగప్పదొరలు రూ.15వేలు విలువైన 100 కంచాలకు సమకూర్చారు. పాఠశాల స్థలదాత చల్లా చినబాబు, హెచ్ఎం సీహెచ్.ప్రకాష్, విద్యాకమిటీ చైర్మన్ అంజనేయులు, వైస్‌చైర్మన్ బి.శ్రీను ఉన్నారు.

క్లాత్ బ్యాగ్‌ల పంపిణీ

కాకినాడ సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జగన్నాధపురంలో బర్రి నాగేశ్వరరావు అండ్ పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత క్లాత్ బ్యాగ్‌ల పంపిణీలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వైడీ రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మేనేజింగ్ ట్రస్టీ తులసమ్మ, ట్రస్టీలు వీ.మూర్తి, భారతి, శాంతి, తాతారావు, రామారావు తదితరులున్నారు.

'అవకతవకలపై విచారణ జరపాలి'

కాకినాడ సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంజయ్‌నగర్ పిడుగులమ్మ తల్లి ఆలయ ఆదాయం అవకతవకలపై విచారణ జరపాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వొమ్మి బాలాజీ, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు జిల్లా అధికారులకు, పోలీస్ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. బాలాజీ మాట్లాడుతూ అమ్మవారి ఆలయ నిర్వహణలో గత పాలక వర్గం నిధుల దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. గత కమిటీకి బాధ్యతలు అప్ప గించేనాటికి అమ్మవారికి వెండి, బంగారు ఆభ రణాలు, రూ.6లక్షలకు పైబడి హుండీ ఆదాయం ఉందన్నారు. అయితే అమ్మవారి బంగారు ఆభరాలను రూ.2.50 లక్షలకు తాకట్టు పెట్టి ఉత్సవాలు జరిపినట్లు లెక్కలు చూపుతు న్నారన్నారు. అదేవిధంగా ఆలయ పునఃనిర్మాణ సమయంలో దాతలు పెద్ద మొత్తాలలో విరాళాలు ఇచ్చినప్పటికీ లెక్కల్లో చూపలేదన్నారు. సమగ్ర విచారణ జరిపించి బంగారు ఆభరణాలు, హుండీ నగదు తిరిగి అమ్మవారికి చెందేలాచేయాలని కోరారు.



కోరింగ అభయారణ్యంలో ఫారెస్టు అధికారుల బృందం

కోరింగలో ఫారెస్టు అధికారుల సందర్శన

తాళ్లరేవు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఫారెస్ట్ అకాడమిలో శిక్షణ పొందుతున్న 10వ బ్యాచ్ ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు 40మంది ఫారెస్టు అధికారులు శనివారం కోరింగ అభయారణ్యం సందర్శించారు. ఫారెస్ట్ రేంజర్ ఆఫీజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో అభయారణ్యంలో మడఅడవులు, పక్షులు, సీబీఈటీపై వివరించారు. ఫారెస్ట్ అకాడమి డిప్యూటీ డీఎఫ్‌వో టి.శ్రీనివాసరావు, ఎఫ్ ఆర్‌వో డి.లలితకుమారి, ఎఫ్ఎస్‌వోలు వీరభద్రరావు, సిద్ధార్థ, ఎఫ్‌బీవోలు మహేష్, గోపినాగేంద్రకుమార్, సుబాని, ధనంజయరావు, మధు, సంధ్యారాణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

శృంగారవల్లభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

పెద్దాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామివారిని శనివారం అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రూ.1,75,996 ఆదాయం సమకూరినట్లు ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులున్నారు.

రక్త దానం ప్రాణ దానంతో సమానం

ప్రత్తిపాడు, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రత్తిపాడు మినర్వా విద్యాసంస్థల ఫౌండర్, లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ డీవీఎస్ రాజురమేష్ చెప్పారు. స్థానిక మినర్వాలో శనివారం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని రాజు ప్రారంభించారు. మినర్వా విద్యాసంస్థల కరస్పాండెంట్ ముత్యాల మురళీ కృష్ణ, 40ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదానం చేశారు. రక్త దాతలకు రూ.లక్ష బీమా కల్పిస్తున్నట్లు బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి

ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

నియోజకవర్గవ్యాప్తంగా పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లు

రంపచోడవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పాఠశాల చైర్మన్ డి.సురేందర్‌సింగ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మెగా పేరెంట్ సమావేశానికి ఆయనతోపాటు ట్రైనీ కలెక్టర్ భావన, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ఏజెన్సీ పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. ట్రైనీ కలెక్టర్ భావన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్‌దొర, పాఠశాల వైస్‌చైర్మన్ పి.ప్రవంతి, ప్రధానోపాధ్యాయురాలు ఎం.పద్మావతి, సీఐ రవికుమార్, ఎస్ఐ షరీఫ్, పీడీ భవాని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో



ఉత్తమ ఉపాధ్యాయిని కృష్ణవేణికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఐటీడీఏ పీఓ అపూర్వభరత్

వై.రామవరంలో..

వై.రామవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పనసలపాలెం, వై.రామవరం, పి.యర్రగొండ, యార్లగడ్డ, దాలిపాడు, బందిగడ్డ, కోట గ్రామాల్లో ఆశ్రమ, ఎంపీపీ, జడ్పీ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎం పీడీవో రవి కిషోర్, ఎస్ఐ రామకృష్ణ, ఈవోపీఆర్డీ శివకుమార్, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, ప్రిన్సిపాల్ రామకృష్ణ పాల్గొన్నారు.

చింతూరులో..

చింతూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలంలో మెగా పేరెంట్సు సమావేశాలు ఘనంగా నిర్వహించారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో బడి వైపు ఒక అడుగు పేరిట నిర్వహించిన కార్యక్రమానికి ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ పాల్గొన్నారు. పీట విద్య ఆవశ్యకతను వివరించారు. ఉత్తమ ఉపాధ్యాయినులకు ప్రశంసాపత్రాలు అందజే శారు. ఆదిమ గురుకుల పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశం సందర్భంగా పోలీసులు డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్‌పీ పంకజ్‌కుమార్ మీనా డ్రగ్స్ వినియోగంతో జరిగే అనర్థాలను వివరించారు.

అడ్డతీగలలో..

అడ్డతీగల, డిసెంబరు 7: మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు మండలంలోని అన్ని ప్రభుత్వ, గిరిజన, ప్రైవేటు పాఠశాలలో కళాశాలలో వైభవంగా నిర్వహించారు. విద్యార్థులపట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారించడం ద్వారా విద్యార్థుల ప్రతిభ మరింత సులభమవుతుందని అడ్డతీగల ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కె.హరినాధరావు సూచించారు. ఉపాధ్యాయులు కూడా పిల్లలకు మక్కువతో తమ వృత్తిని అవలంబిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఎంఈవో మల్లేశ్వరరావు అన్నారు.

మోతుగూడెంలో..

మోతుగూడెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సాంసన, పంచాయతీ కార్యదర్శి జి.మోహన్, మోతుగూడెం ఎస్ఐ నూకరాజు, విద్యాకమిటీ చైర్మన్ షణ్ముఖం మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గూడూరులో గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో సైబర్ క్రైం, డ్రగ్స్ గురించి మోతుగూడెం ఎస్ఐ కె.శివనారాయణ వివరించారు.

రాజవొమ్మంగిలో..

రాజవొమ్మంగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ శనివారం పండుగ వాతావరణంలో జరిగింది. అన్ని పాఠశాలల్లో విద్యార్థుల తల్లులు ముగ్గుల పోటీల్లో పాల్గొనగా తండ్రులకు వివిధ రకాల ఆటల పోటీలను ఉపాధ్యాయులు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్‌రాజు, తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరేశ్వరరావు కార్యక్రమాలను పరిశీలించారు. సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ నరసింహమూర్తి పాఠశాలలకు వెళ్లి విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు.

ఎటపాకలో..

ఎటపాక, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెగా టీచర్ పేరెంట్ మీటింగ్‌ను శనివారం అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థులు, పేరెంట్స్, ఉపాధ్యాయులు సహ భోజనాలు చేశారు. వైద్యశిబిరం నిర్వహించారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి

మోతుగూడెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చింతూరు మండ లం మోతుగూడెంలో శనివారం శ్రీలక్ష్మి గణపతి ఆలయంలో సుబ్రహ్మణ్యషష్ఠి సందర్భంగా ఆలయ ప్ర ధాన అర్చకులు పవన్ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

నాగమ్మఅమ్మవారి గుడిలో..

వై.రామవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సుబ్బారాయుడు షష్ఠి మహోత్సవాన్ని పురస్కరించుకుని వై.రామవరంలోని శ్రీగణపతి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నాగమ్మఅమ్మవారి ఆలయంలో శనివారం పూజలు ఘనంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి కల్యాణంలో భక్తులు పాల్గొన్నారు.

● వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు తెల్లవారుజామునుంచి మూలవిరాట్టుకు పాలాభిషేకాలు, పంచామృత అభిషేకాలు, నానా విధి పరిమళ పుష్పాలతో స్వామిని పూజించారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాంఘిక అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌కు సంఘమిత్ర అవార్డు

వరరామచంద్రాపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన అంతర్జాతీయ సామాజికవేత్తల దినోత్సవం సందర్భంగా సోషియో కల్చరల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అల్లూరి ఏఎస్ఆర్ జిల్లా రంపచోడవరం డివిజన్‌లోని వీఆర్‌పురం మండలంనుంచి వ్యవసాయ, సాంఘిక అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబుకు సంఘమిత్ర అవార్డును పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని, అసోసియేషన్ కల్చరల్ అవార్డును అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం సంస్థ సభ్యులు మాట్లాడుతూ సంఘమిత్ర జాతీయ ప్రతిష్ఠాత్మక అవార్డును ఆదివాసీ గిరిజనులకు గాంధీబాబు చేసిన సేవలకుగాను ఎంపిక చేశామన్నారు. ఆయన కోవిడ్ సమయంలోను, వరదల సమయంలోనే సేవా కార్యక్రమాలు చేశారన్నారు. కార్యక్రమంలో బాలగంగాధర్ తిలక్, డైరెక్టర్ స్నేహశ్రీ, డాక్టర్ బీఆర్ సుశీల్‌కుమార్, ప్రముఖ సామాజికవేత్తలు పాల్గొన్నారు.

ఏజెన్సీలో అక్రమ కట్టడాలు నిలుపుదల చేయాలి: ఆదివాసీ సంక్షేమ పరిషత్

రంపచోడవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో అక్రమ కట్టడాలు నిలుపుదల చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన అధికారులు అమలు చేయడం లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్‌నాయకులు మోడిత నూకరాజు, పీట ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శనివారం ఐటీడీఏ, సబ్ కలెక్టరు, స్పెషల్ డిప్యూటీ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేశారు. అక్రమ కట్టడాలు నిలుపుదల చేయకపోతే సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు

జగ్గంపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మర్రిపాకలో శనివారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారిని పల్లకీలో గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద గ్రామస్తులు సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కాట్రావుపల్లిలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు తమ్ములపల్లి రమేష్‌ను శాలువాతో సత్కరించారు. కాట్రావులపల్లి జనసేన పార్టీ అధ్యక్షులుసుంకర శ్రీనివాస్, నార్ల దినేష్, దాడి మణికంఠ, సుంకర హరిబాబు, వానుమ్ రాంబాబు, అడపా మహేష్, జోగడ లోవ టరాజు, మాదారపు వీరబాబు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో వల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి

వారి షష్ఠి వేడుకలు ఘనంగా చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

భక్తులతో ఆలయాలు కిటకిట

గండేపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని షష్ఠి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉప్పలపాడులో పోలవరం గట్టుపై వేంచేసియున్న పొలిమేరు నాగసుబ్రహ్మణ్యస్వామి

పూజలు, అభిషేకాలు

ఏలేశ్వరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం సాయిబాబా మెట్ట వద్ద ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి సాయి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రీరాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కోడూరి మహేష్, వేంకటేష్ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ప్రత్తిపాడు, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్తిపాడు, శరభవరం గ్రామాల్లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు విశేషపూజలు నిర్వహించారు. శరభవరంలోని స్వామి వారి ఆలయం వద్ద మూడురోజులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మెల్యే సత్యప్రభ పూజలు

శంఖవరం, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి) కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లో సుబ్రహ్మణ్యే శ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పురోహితులు వేమకోటి సత్యనారాయణ, త్రినా ధశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో స్వామి వార్ల కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బద్ది రామారావు, వెన్నా శివ, జనార్ధన్, జీలకర్ర త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నిల్వ ఉంచిన సుద్ద మాయం

జగ్గంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రామవరంలో భూగర్భ గనులు, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న సుద్ద మట్టి మాయమైంది. 2021లో ఒక వ్యాపారి అనుమతులు లేకుండా యంత్రాలతో సుద్ద మట్టి తవ్వి భారీ వాహనాల్లో తరలించుకుపోయారు. స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో భూగర్భగనులు, రెవెన్యూ అధికారులు స్పందించి పరిశీలన చేశారు. ప్రభుత్వ భూములు తవ్వకాలు చేస్తున్నట్లు గుర్తించి భూములు స్వాధీనం చేసుకున్నారు. తవ్వకాలు పాల్పడిన వ్యక్తికి రూ.1.10కోట్లు అపరాధ రుసుం విధించారు. స్వాధీనం చేసుకున్న 2వేల క్యూబిక్ మీటర్ల సుద్దను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. గుర్తుతెలియని కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రే తరలించకపోయినట్లు తెలిసింది. రెవెన్యూ అధికారులు సుద్ద నెల ప్రాంతాన్ని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

తాండవ నదిలో వ్యక్తి గల్లంతు

తుని రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తుని రూరల్ రేకవానిపాలెం గ్రామానికి చెందిన గడ్డం సాయి(23) రేఖవానిపాలెం శివారు తాండవ గట్టుపై నుంచి జారి నదిలో గల్లంతయ్యాడు. పోలీసులు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తాండవ నదిలో గాలింపు చర్యలు చేపట్టారు.

బియ్యం అక్రమ నిల్వలపై కొనసాగుతున్న విచారణ

తుని రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యంను రీసైక్లింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న ముఠా గుట్టురట్టువుతుంది. కాకినాడ జిల్లా తుని మండలం కొలిమేరు సమీపంలో ఓ రైతు కోళ్ళ ఫారంలో బయట ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు 500బస్తాల బియ్యం అక్రమంగా నిల్వ ఉంచడటంపై ఇప్పటికే రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఇదేప్రాంతంలో కొందరిరేషన్ డీలర్ల ప్రమేయం ఉన్నట్లు తెలిసింది. ఎండీయూ వాహనాల నిర్వాహకులు, రేషన్ డీలర్లు కుమ్మక్కై కార్డుదారుల దగ్గర కొనుగోలుచేసిన రైస్‌ను కొలిమేరులో వైసీపీ నేత రైస్ మిల్లుకు తరలించి రీసైక్లింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. శనివారం జిల్లా సేల్ ట్యాక్స్ అధికారులు బియ్యం అక్రమ నిల్వలను పరిశీలించారు. స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని నిల్వఉంచిన 500బస్తాల బియ్యానికి సరైన ఆధారాలు చూపకుంటే సంబంధిత బియ్యంను సీజ్ చేస్తామని సేల్‌ట్యాక్స్ అధికారులు తెలిపారు. బియ్యం నిల్వలను పరిశీలించిన వారిలో జిల్లా అసిస్టెంట్ సేల్‌ట్యాక్స్ ఆఫీసర్ ప్రేమ్‌కుమార్, అడిషనల్ సేల్‌ట్యాక్స్ ఆఫీసర్ సంతోష్ వర్మ, డీఎస్‌సీ ఆఫీసర్ మాధవి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

తునిలో కూటమి కార్యాలయం ప్రారంభం

తునిరూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తునిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య చొరవతో కూటమి కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన సభాపక్ష నేత యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యనమల దివ్య హాజరయ్యారు. ఈసందర్భంగా నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున హాజరైన కార్యకర్తలను ఉద్దేశించి యనమల మాట్లాడారు. నిత్యం ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని, ప్రజల మన్ననలు పొందే నాయకులుగామెలగాలన్నారు. ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ నేటి నుంచి ప్రజా సేవకు వేదికగా కూటమి కార్యాలయం సేవలు అందిస్తుం దన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుకుమంచి శోభారాణి, యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మల్ల గణేష్, సిద్దాంతపు సత్తిబాబు, గడ్డమూరి శివ, జల్లు వాసు, అల్లురాజు తదితరులు పాల్గొన్నారు.



ఉన్నత విద్యా ప్రమాణాలే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

● మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాలు

జగ్గంపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా ప్రమాణాలే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. రాజపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన మెగా పేరెంట్, టీచర్స్ సమావేశానికి ఆయన మాట్లాడారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పాండ్రంగి రాంబాబు, రాజపూడి సర్పంచ్, రాజపూడి కూటమి నాయకులు, రాజపూడి విద్యా కమిటీ, రాజపూడి హైస్కూల్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

స్కూల్‌కు మంచి పేరు తీసుకురావాలి

జగ్గంపేట బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ రాజకుమారి అధ్యక్షతన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రవర్తనతో చదువుకోవాలని, స్కూల్‌కి గ్రామానికి మంచి పేరుప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, విద్యాకమిటీ చైర్మన్ సుజాత మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌జేఎస్ వల్లి పిడి చిట్టిపాప, పి.ఉషారాణి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటలపోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు. జగ్గంపేట కోనేటి వీధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. పూర్వవిద్యార్థి ఎస్వీఎస్ అప్పలరాజు విద్యార్థులకు స్వీట్లు పంచారు.

విద్యార్థుల ప్రతిభ నివేదికలు

తొండంగి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. పాఠశాలలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థుల సమక్షంలో విద్యార్థుల ప్రగతిని వివరించారు. సామూహిక మధ్యాహ్న భోజనాలు చేశారు. ఎంఈవోలు షేక్ బాబ్జీ, అని శెట్టి సుబ్బిరెడ్డి పర్యవేక్షించారు. చిన్నయ్యపాలెం ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో నరహరిశెట్టి సూర్య ప్రకాష్, వడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్స్ సమావేశం

గండేపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను తల్లిదండ్రుల సమక్షంలో వారికి అందించి వారి ప్రగతిని తెలియపరిచారు. గండేపల్లి, మురారి పాఠశాలలను ఎంపీడీవో నాతి బుజ్జి, ఎంఈవో నాయక్ సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. మల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో కె.వెంకటరెడ్డి, మల్లేపల్లి హెచ్ఎం సుదామాధురి, విద్యాకమిటీ చైర్మన్ కంచర్ల సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో సమావేశాలు

తునిరూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ ఉపాధ్యాయుల సమావేశాలు పట్టణ, మండల గ్రామాల్లో పండుగ వాతావరణంలో జరిగింది. గదులు, గుమ్మాలకు మామిడి తోరణాలు అలంకరించి తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించారు. ఎన్.సూరవరంలో జరిగిన కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత చింతమనీడి నాగ సోమరాజు హాజరై తన సొంత నిధులతో విద్యార్థులకు, తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. తేటగుంట గ్రామంలో మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు చామంతి దుర్గారావు హాజరయ్యారు. వి.కొత్తూరు గ్రామంలో మాజీ తాండవ షుగర్స్ చైర్మన్ సుర్ల లోవ రాజు, తామరాన సత్యనారాయణ, రొంగల అబ్బు హాజరయ్యారు.

విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు

ఏలేశ్వరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలో ఉన్న 40ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు ఆయా పాఠశాలల్లో సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులకు ముగ్గులు, ఖోఖో, కుర్చీలాట, క్రికెట్ పోటీలు నిర్వహించారు. తల్లిద్రండులు పిల్లలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు జిల్లా విద్యాశాఖాధికారి పిల్ల రమేష్ హాజరై పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, రికార్డులు పరిశీలించారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

శంఖవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) మండలంలోని గ్రామాల్లో గల పాఠశాలల్లో శనివారం ఆయా పాఠశాలల చైర్మన్లు, హెచ్ఎంల ఆధ్వ ర్యంలో మెగా పేరేంట్స్, ఉపాధ్యాయయుల సమావేశాలు నిర్వహించారు. తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఎటపాక, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఉన్నత చదువులు అభ్యసించి ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని సీఐ కన్నపరాజు అన్నారు. ఎటపాకలో శనివారం విద్యార్థులతో కలిసి పోలీసులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఎటపాక పోలీస్‌స్టేషన్ నుంచి ఎటపాక ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ కరి పార్థసారథి, కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం పోలీసులు డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత గంజాయి, డ్రగ్స్ జోలికి వెళ్లి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సీఐ సన్యాసినాయుడు అన్నారు. విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ చేశారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

మోతుగూడెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధి బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మంగంపాడు వారపుసంతలో మావోయిస్టులకువ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టులు డిసెంబరు 2 నుంచి 8 వరకు చేపట్టిన వారోత్సవాలకు వ్యతిరేకంగా, మావోయిస్టు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా అల్లూరి ఆదివాసీ యువజన సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం యువకులు ర్యాలీ నిర్వహించారు.

అక్రమ ఇసుక తరలింపుతో మాకు సంబంధం లేదు

రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం గుండాల ఇసుక ర్యాంపు నుంచి అక్రమ తరలింపు చేసే వ్యక్తులకు, తమకు సంబంధం లేదని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఆమె మీడియాకు ఓ వీడియోను విడుదల చేశారు. కొంతమంది తన పేరు, తన భర్తపేరు వాడుతున్నారని తెలిసిందని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని తామే కోరుతున్నామన్నారు. గిరిజనేతరుల ఇళ్లపై తాము ఎల్‌టీఆర్‌పి కేసులు పెట్టిస్తున్నామన్న ప్రచారాన్ని కొందరు చేస్తున్నారని, తమకు గిరిజన-గిరిజనేతర వ్యత్యాసం లేదని అన్నారు. తమ పేరు చెప్పి కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తమ దృష్టికి వచ్చాయని, ప్రజలే వారిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

అన్నవరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడికి ప్రాకారసేవ శనివారం వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తోడ్కొనివచ్చి తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించారు. మేళతాళాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ చేయించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యంపాల్గొన్నారు.

అరుణోదయ సభలను జయప్రదం చేయండి

జగ్గంపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 14,15 తేదీల్లో జరిగే అరుణోదయ సాంస్కృతి సమాఖ్య సభలను జయప్రదం చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని రామవరం శివారు రంగవల్లి నగర్‌లో శనివారం ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, సురేష్ పాల్గొన్నారు.

రేపు తునికి రానున్న బచ్చలమల్లి సినిమా టీమ్

గండేపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తునిలోని రాజా గ్రౌండ్‌కు బచ్చరమల్లి సినీ హీరో అల్లరి నరేష్ టీమ్ ఈనెల9వతేదీన రానున్నట్లు శ్రీవీరాజంనేయ ఫిల్మ్ అధినేతలు కొత్త చినవీరభద్రరావు(శివ), బూర్లు సాయి తెలిపారు. ఈనెల20న బచ్చలమల్లి సినిమా విడుదలవుతుందన్నారు. ఈసినిమా డైరెక్టర్ తుని ప్రాంతానికి చెందిన వ్యక్తి అన్నారు. అతను గతంలో తీసిన సినిమాలు విజయం సాధించాయన్నారు. ఈనెల9న బచ్చరమల్లి టీమ్‌తో క్రికెట్ మ్యాచ్ జరుగుతుందన్నారు. ఈమ్యాచ్‌లో గెలిచిన విజేతలతో ఒక పాటను రిలీజ్ చేయిస్తామన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రత్తిపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు కోరారు. ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో డీఎస్పీ ముఖ్య అతిథిగా మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ జిల్లా ఈడీ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్, ఎంఈవో వి.రాజబాబు, ఎస్ఐ ఎస్. లక్ష్మీకాంతం మాట్లాడారు.

వైసీపీ మండల అధ్యక్షుడు రాజీనామా

ఏలేశ్వరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడు అడపా పార్థసారధి శనివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాజీనామా లేఖను వైసీపీ పార్టీ అధ్యక్షుడు జగన్‌కు పంపారు.ప్రస్తుత రాజకీయ పరిణామాలపై రాజీనామా చేసినట్లు తెలిసింది.

సైబర్ నేరాల అదుపునకు చర్యలు

ప్రత్తిపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల అదుపునకు చర్యలు చేపట్టాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ప్రత్తిపాడు సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం రాత్రి ఆయన సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హైవేపై ప్రమాదాలు జరిగే ప్రదేశాలు గుర్తించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలన్నారు. ఆయన వెంట పెద్దాపురం డీఎస్పీశ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు ఉన్నారు.

మత విశ్వాసాలను గౌరవించాలి

రౌతులపూడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) మత విశ్వాసాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. రౌతులపూడిలో మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్యామిలీ మెగా క్రిస్మస్ వేడుకల్లో ఆమె మాట్లాడారు.ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్య భాస్కరరావు, వెన్నాశివ, శామ్యూల్ పాల్గొన్నారు.